18-08-2025, సోమవారం
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
సంపుటి: 10 | సంచిక:82 | వెల:05




EDITOR:
BANDARI MARUTHI

# సాగు నీటిపై ప్రజల్ని తప్పుదోవ

## ప్రజలందరికీ వాస్తవాలు తెలుసు



కేటాయింపుల తర్వాతే మిగులుపై చర్చ

రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది

కొందరి ప్రచారం వాస్తవానికి దూరం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**జనం పవర్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్టానికి నదీ జలాల ప్రాధాన్యం ఎంతో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటే ప్రధానంగా సాగునీటిని అందించడమే లక్ష్యమని ఆయన గుర్తుచేశారు. బీడు భూములను పంటలకు అనువుగా మార్చడం కోసం ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరమని తెలిపారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ..

..మిగతా 3లో



## నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి

22 గేట్లు ఎత్తి నీటి విడుదల

3

శ్రీశైలానికి తగ్గుతున్న వరద

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వివాహ వేడుకకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి



శంషాబాద్ జీఎంఆర్ ఎరీనాలో జరిగిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్‌రెడ్డి వివాహ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు వేడుకకు హాజరయ్యారు.



## నిర్మాణ రంగంలో స్వదేశీ ఉత్పత్తులే వాడుదాం

ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తున్న హైదరాబాద్

నిర్మాణ రంగంలోనూ మనమే టాప్ లో ఉన్నాం

హైదరాబాద్ ఉత్పత్తులకు కేంద్రం కావాలి

క్రెడాయ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2



## రైతులపై పగ తీర్చుకుంటున్న కాంగ్రెస్ పార్టీ

ఎల్లంపల్లి నీటిని వినియోగించుకోవడంలో విఫలం

కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయకపోతే మేమే చేస్తాం

మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం

3

## పాకిస్తాన్‌లో ఘోర రైలు ప్రమాదం

ఒకరు మృతి, 20 మందికి పైగా గాయాలు

2

## భారత్‌పై అదనపు టారిఫ్‌లు లేనట్లే

ట్రంప్ సడలింపు సంకేతాలు

## వరద ముంపులో ఏడుపాయల ఆలయం



గర్భగుడిలో సాధారణంగా జరిగే సేవలు నిలిపివేత

సింగూర్‌లోని నక్క వాగు నుంచి 50 వేల క్యూసెక్కులకు పైగా నీరు

నదీపాయ రాజగోపురం నుంచి ఉద్ధృతంగా నీరు

భక్తుల రాకపోకలు నిలిపివేత

సహకరించాలని ఆలయ ట్రస్టు, పోలీసులు విజ్ఞప్తి

2

## జమ్మూ కశ్మీర్ లో మళ్లీ మేఘ విస్ఫోటం

ఏడుగురు మృతి, పలువురు గల్లంతు

కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో విపత్తు

తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో విస్ఫోటం

జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ

అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు

2





## భారత్‌లో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

ఢిల్లీ విమానాశ్రయంలో ఘన స్వాగతం

త్వరలోనే ప్రధాని మోడీని కలవనున్న శుక్లా

3







Contact: 96181 81112

# వరద ముంపులో ఏడుపాయల ఆలయం

**గర్భగుడిలో సాధారణంగా జరిగే సేవలు నిలిపివేత**

**సింగూర్‌లోని నక్క వాగు నుంచి 50 వేల క్యూసెక్కులకు పైగా నీరు**

**నదీపాయ రాజగోపురం నుంచి ఉద్ధృతంగా నీరు**

**భక్తుల రాకపోకలు నిలిపివేత**

**సహకరించాలని ఆలయ ట్రస్టు, పోలీసులు విజ్ఞప్తి**

**జనం పవర్, హైదరాబాద్:**



మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం వరద జలాల నడుమ నాలుగో రోజూ జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. ఆలయం చుట్టుపక్కల నీరు ఉప్పొంగిపోవడంతో, గర్భగుడిలో సాధారణంగా జరిగే సేవలు నిలిపివేయబడ్డాయి. ఈ నేపథ్యంలో ఆలయ రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అభిషేకం, విశేషాలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. సింగూర్‌లోని నక్క వాగు నుంచి 50 వేల క్యూసెక్కులకు పైగా నీరు వనదుర్గ ఆనకట్టలోకి చేరింది. దీంతో ఆనకట్ట పొంగిపొర్లుతూ గర్భగుడి ముందు ఉన్న నదీపాయ రాజగోపురం నుంచి ఉద్ధృతంగా నీరు ప్రవహిస్తోంది. ఈ వరద కారణంగా ఆలయ పరిసరాలు పూర్తిగా మునిగిపోయాయి.

**భక్తుల రాకపోకలు నిలిపివేత**

వరద ముప్పు దృష్ట్యా భక్తుల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఆలయానికి వచ్చే దారుల వద్ద పోలీసు ఔట్‌పోస్ట్ సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేసి పటిష్ఠ భద్రత చేపట్టారు. భక్తులు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు చేరకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అమ్మవారి దైవిక సేవలు ఆగిపోకుండా ఉండేందుకు తాత్కాలికంగా రాజగోపురంలోనే ప్రతిరోజూ పూజలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల భక్తులు ఆలయ ప్రాంగణం బయట నుంచే దూరదర్శనం చేసుకునే వీలు కల్పిస్తున్నారు. వరద నీరు తగ్గే వరకు ఆలయ గర్భగుడికి ప్రవేశం నిలిపివేయాలని అధికారులు స్పష్టం చేశారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని ఆలయ ట్రస్టు, పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## పాకిస్తాన్‌లో ఘోర రైలు ప్రమాదం

**- ఒకరు మృతి, 20 మందికి పైగా గాయాలు**

**జనం పవర్, హైదరాబాద్:**

పాకిస్తాన్‌లో మరో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం పంజాబ్ ప్రావిన్స్‌లోని లోధ్రాన్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఒక ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. సమాచారం ప్రకారం, పెషావర్ నుంచి కరాచీ వైపు వెళ్తున్న ఒక ప్యాసింజర్ రైలులోని నాలుగు బోగీలు అకస్మాత్తుగా పట్టాలు తప్పాయి. బోగీలు ఒక్కసారిగా తూలిపడడంతో లోపల ఉన్న ప్రయాణికులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే రక్షణ సిబ్బంది, పోలీసులు, స్థానిక అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. గాయపడినవారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. లోధ్రాన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ లుబ్నా నజీర్ ప్రకారం, మరణించిన వారితో పాటు మరో ఇద్దరి ఆరోగ్య స్థితి ఆందోళన కలిగించేలా ఉందని తెలిపారు. ప్రమాదం తర్వాత ఈ రైల్వే మార్గంలో రాకపోకలను కొన్ని గంటలపాటు నిలిపివేశారు. అనంతరం ట్రాక్ మరమ్మతులు పూర్తయిన తర్వాత రైళ్ల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. ఇప్పటివరకు ఈ ప్రమాదానికి గల నిజమైన కారణం వెలుగులోకి రాలేదు. రైల్వే అధికారులు దానిపై దర్యాప్తు ప్రారంభించారు. పాకిస్తాన్‌లో ఇటీవలి కాలంలో రైలు ప్రమాదాలు వరుసగా చోటుచేసుకోవడంతో ప్రయాణికుల్లో భయాందోళనలు పెరుగుతున్నాయి.

## అభివృద్ధి చెందుతోన్న భారత్‌కు దిల్లీ ఓ నమూనా - ప్రధాని మోదీ



**జనం పవర్, హైదరాబాద్:**

అభివృద్ధి చెందుతోన్న భారత్‌కు దిల్లీ ఓ నమూనాగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం గత 11 ఏళ్లుగా తమ ప్రభుత్వం అన్ని స్థాయిల్లో కృషి చేస్తోందన్నారు. దేశ రాజధానిలో సుమారు రూ.11వేల కోట్లతో నిర్మించిన రెండు ప్రధాన హైవే ప్రాజెక్టులను ప్రారంభించిన ఆయన.. వీటితో దిల్లీ, సమీప ప్రాంత ప్రజలకు ఈ రహదారులు ఎంతో సౌలభ్యంగా ఉంటాయన్నారు. ''అధునాతన కనెక్టివిటీ పొందిన దిల్లీ ప్రజలకు అభినందనలు. ప్రపంచం భారత్‌పై ఓ అభిప్రాయానికి రావాలనుకున్నప్పుడు తొలుత దాని చూపు రాజధాని వైపు ఉంటుంది. అందుకే అభివృద్ధి చెందిన దేశానికి దిల్లీని ఓ నమూనాగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం మన ప్రభుత్వం అనేక స్థాయిల్లో కృషి చేస్తోంది. గడిచిన 11 ఏళ్లలో దిల్లీ ఎన్‌సీఆర్‌లో ప్రయాణం సులభతరమైంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**పార్టీలపై ఈసీ ఎలాంటి వివక్ష చూపదు సీఈసీ**

నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు సమీప ప్రాంతాలకు ప్రయాణ సమయాన్ని తగ్గించే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రెండు కొత్త ప్రాజెక్టులు పూర్తిగా అందుబాటులోకి వస్తే సోనిపత్, రోహ్‌తక్, బహదుర్‌గఢ్‌తోపాటు గురుగ్రామ్ నుంచి ఐజీఐ ఎయిర్‌పోర్టు వరకు ప్రయాణం సులభమవుతుందన్నారు. అంతకుముందు రోహిణి ప్రాంతంలో మెగా రోడ్ షో నిర్వహించిన మోదీ.. ప్రాజెక్టు పనుల గురించి సమీక్ష జరిపారు.

## నిర్మాణ రంగంలో స్వదేశీ ఉత్పత్తులే వాడుదాం

**ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తున్న హైదరాబాద్**

**క్రెడాయ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**జనం పవర్, హైదరాబాద్:**

నగరంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. నిర్మాణ రంగ వ్యాపారులు ఇళ్ల నిర్మాణం నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. ''ఇప్పటికే హైదరాబాద్.. ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తోంది. నిర్మాణం రంగంలోనూ దూసుకుపోతోంది. అంతర్జాతీయ విమానాశ్రయాలు, జాతీయ రహదారులు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తోంది. వరంగల్‌లో విమానాశ్రయం రాబోతోంది. ఆదిలాబాద్‌లోని డిఫెన్స్ ఎయిర్‌పోర్టును ప్రజా ఎయిర్‌పోర్టుగా మారుస్తున్నాం. ఎంఎంటీఎస్ రైళ్లను ఏసీ రైళ్లుగా మారుస్తాం. సాంకేతిక కారణాలతో మెట్రో పెండింగ్‌లో ఉంది. దాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. సికింద్రాబాద్‌లో రూ.720 కోట్లతో రైల్వే పనులు చేస్తున్నాం. హైదరాబాద్‌విజయవాడ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పూర్తి చేస్తాం''అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## జమ్మూలో మళ్లీ మేఘ విస్ఫోటం

**ఏడుగురు మృతి**

**కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో విపత్తు**

**తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో విస్ఫోటం**

**జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ**


**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు**

**జనం పవర్, హైదరాబాద్:**



జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఇటీవల సంభవించిన క్లౌడ్ బరస్ట్.. పెను విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ఉపద్రవాన్ని మరువక ముందే కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారని అధికారులు తెలిపారు.

ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ విస్ఫోటం సంభవించిందని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆ ప్రాంతానికి చేరుకుందని వెల్లడించారు. ఘాటీ సమీపంలోని జుతానా జోడ్ అనే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో శిథిలా కింద ఒక కుటుంబం చిక్కుకున్నట్లు తెలుస్తోంది.
భారీ వర్షాల కారణంగా సహాక్ ఖాద్, ఉజ్ నదులలో నీటి శాతం అమాంతంగా పెరిగిపోయిందని అధికారులు తెలిపారు. రైలు పట్టాలు దెబ్బతినడంతో పాటు ఆ ప్రాంతంలోని జాతీయ రహదారితో సహా ప్రధాన మార్గాలపై వాహనాలు నిలిచిపోయాయన్నారు. కథువా పోలీస్ స్టేషన్‌లోకి కూడా వరదనీరు చేరింది.
ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. మేఘ విస్ఫోటంపై సమాచారం అందగానే కథువా పోలీసు అధికారి శోభిత్ సక్సేనాతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అలాంటి ప్రదేశాలకు దూరంగా వెళ్లాలని కోరారు.
ఇటీవల మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులపై మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో సహా ఇప్పటి వరకు 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 82 మంది గల్లంతయ్యారు.



## కేరళలో అరుదైన మెదడు వాపు వ్యాధి సోకి బాలిక మృతి

**జనం పవర్, హైదరాబాద్:**

కేరళలోని కోజికోడ్ జిల్లాలో తొమ్మిదేళ్ల బాలిక మృతికి కారణం అమీబిక్ ఎన్‌కెఫలిటిస్ అనే అరుదైన మెదడు వాపు వ్యాధి అని ఆరోగ్యశాఖ అధికారులు శనివారం నిర్ధారించారు. కలుషిత నీటిలో నివసించే అమీబా వల్ల ఈ వ్యాధి సోకుతుందని వారు తెలిపారు. జ్వరంతో బాధపడుతోన్న తమరస్సేరీకి చెందిన బాలికను ఈ నెల 13న కుటుంబ సభ్యులు సమీప ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మరుసటిరోజు బాలికను కోజికోడ్‌లోని వైద్య కళాశాలకు తరలించగా అదేరోజు ఆమె మరణించింది. మైక్రోబయాలజీ పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలిక మరణానికి అమీబిక్ ఎన్‌కెఫలిటిస్ కారణమని స్పష్టంచేశారు. ఈ వ్యాధికి సంబంధించి ఈ ఏడాది జిల్లాలో మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ వ్యాధి సోకడానికి కారణమైన అమీబా గురించి అన్వేషించడానికి బాలిక ఇంటి పరిసరాల్లోని నీటి కాలువలు, చెరువులను పరిశీలిస్తున్నారు.

## బిహార్‌లో ఓట్ల చోరీ కానివ్వం: రాహుల్ గాంధీ



**జనం పవర్, హైదరాబాద్:**

ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆరోపణలను తీవ్రతరం చేశారు. ఓట్ల విషయంలో భాజపాతో కలిసి ఈసీ అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఇప్పుడు యావత్ దేశానికి తెలిసిందన్నారు. బిహార్‌లోని సాసారం నగరంలో ''ఓటర్ అధికార్ యాత్ర'' ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట బిహార్‌లో ఓట్ల తొలగింపు, చేర్పుల వంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. 'ఇండియా' కూటమి దీనికి అనుమతించబోదని, పేదల ఓటు అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వబోదన్నారు.


''దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చోరీకి గురవుతున్నాయి. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి సత్తా చాటింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే విజయమనే అంచనాలు వెలువడ్డాయి. కానీ, నాలుగు నెలల్లోనే కోటి మంది ఓటర్లు వచ్చి చేరడంతో.. భాజపా కూటమి గెలిచింది. ఎక్కడైతే ఓట్లు పెరిగాయో.. అక్కడ కాషాయ పార్టీ గెలిచింది. ఈసీ ఏం చేస్తోందో ఇప్పుడు అందరికీ తెలిసింది. ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం నా నుంచి అఫిడవిట్ కోరింది. భాజపా నేతలూ అదే విధమైన వాదనలు చేస్తే.. ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. భాజపా, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయి'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

కేంద్రంలో భాజపా నేతృత్వంలోని సర్కారు అధికారంలో ఉన్నంత కాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు యత్నిస్తోందన్నారు. ఎన్నికల సంఘం భాజపా ప్రభుత్వానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే సర్కారును గద్దెదించుతారన్నారు. మరోవైపు.. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకు ఎన్నికల సంఘాన్ని ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు.

## భారత్‌పై అదనపు టారిఫ్‌లు లేనట్లే

**- ట్రంప్ సడలింపు సంకేతాలు**

**జనం పవర్, హైదరాబాద్:**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై అదనపు సుంకాలు విధించే అంశంలో వెనక్కి తగ్గే సూచనలు ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో జరిగిన కీలక సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ నిర్ణయంపై మరో రెండు-మూడు వారాల్లో పునరాలోచన చేస్తానని తెలిపారు. ట్రంప్ మాట్లాడుతూ, రష్యా తన ముఖ్యమైన చమురు క్లయింట్‌ను కోల్పోయిందని పేర్కొన్నారు. భారత్, చైనా వంటి దేశాలపై ప్రస్తుతం అదనపు టారిఫ్‌లు విధించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా ఇంధన వాణిజ్యంలో ఆసక్తికర చర్చలకు దారితీశాయి. ఇటీవల అమెరికా ప్రభుత్వం భారత్‌పై 25 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త సుంకాలు ఆగస్టు 27 నుండి అమల్లోకి రానున్నాయి. అయితే, ట్రంప్ తాజా ప్రకటనలతో ఆ నిర్ణయం మారే అవకాశాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మారుతున్న తరుణంలో, అమెరికా నిర్ణయాలు గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. రష్యా చమురుపై ఆధారపడి ఉన్న అనేక దేశాలు ట్రంప్ సడలింపు సంకేతాలను స్వాగతించగా, అంతర్జాతీయ మార్కెట్‌లో కొత్త మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో భారత్ సహా ఆసియా దేశాల ఇంధన విధానాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది.



# నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి

**22 గేట్లు ఎత్తి నీటి విడుదల**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షా లతో నాగార్జున సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు 22 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ స్పిల్‌వే ద్వారా 1.71 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఇన్‌ఫ్లో 1.98 లక్షల క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 2.13 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 587 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# శ్రీశైలానికి తగ్గుతున్న వరద

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 1,78,101 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,492 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగు స్పిల్‌వే గేట్ల ద్వారా 1,05,876 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.5 అడుగుల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 196.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



# రైతులపై పగ తీర్చుకుంటున్న కాంగ్రెస్

**జనం పవర్, హైదరాబాద్:**

రాష్ట్రంలో సాగునీటి వినయోగంపై సిద్దిపేటలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీళ్లు చేరుతున్నా, ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించడం లేదని ఆయన ఆరోపించారు. "ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి రోజుకు 62 వేల క్యూసెక్కుల వరదను సముద్రంలోకి వృథాగా వదులుతున్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ఆ నీటిని రిజర్వాయర్లలో నిల్వచేసి రైతులకు ఉపయోగం కలిగించవచ్చు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది" అన్నారు. మిడ్ మానేరులో ఇంకా 20 టీఎంసీల నీరు ఖాళీగా ఉందని, రోజుకు కనీసం 2 టీఎంసీల నీళ్లు పంపితే రాబోయే యాసంగి సీజన్‌లో రైతులకు ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఎల్లంపల్లిలో 7 మోటార్లు ఉన్నా కేవలం 2 మాత్రమే నడుస్తున్నాయని ఆయన విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై పగ తీర్చుకుంటోంది. కేసీఆర్, బీఆర్ఎస్ పై ఉన్న కోపంతో నీటి ప్రాజెక్టులను వాడకుండా వదిలేస్తోంది. వర్షాలు కురుస్తున్నా చెరువులు, డ్యామ్‌లు నింపడం లేదు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం" అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందనే దుష్ప్రచారాన్ని నిజం చేయడానికి మోటార్లు ఆన్ చేయడం లేదని ఆరోపించారు. "ప్రాజెక్టులలో నిల్వ చేసుకోవాల్సిన నీటిని సముద్రంలోకి వదలడం రైతులపై పెద్ద అన్యాయం. ఇలాగే కొనసాగితే మేమే లక్షలాది మంది రైతులతో కలిసి మోటార్లు ఆన్ చేస్తాం" అని హెచ్చరించారు. అలాగే, రాబోయే రోజుల్లో మిడ్ మానేరుతో పాటు అన్నపూర్ణ, రంగనాయక, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టులు కూడా కాళేశ్వరం ద్వారా నిండే అవకాశముందని, కానీ ప్రభుత్వం కావాలనే వాటిని నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్ రావు అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక వైఖరి స్పష్టంగా బయటపడింది. నీటి విలువ రైతు మాత్రమే అర్థం చేసుకుంటాడు. పాలకులకు అది అర్థం కావడం లేదు. ఈ నిర్లక్ష్యం కొనసాగితే తీవ్ర స్థాయిలో పోరాటం చేస్తాం" అని ఆయన హెచ్చరించారు.

# కాల్చి చంపడంలో ఉక్రెయిన్ సైనికుడి ప్రపంచ రికార్డ్..!

**జనం పవర్, హైదరాబాద్:**

ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ సైనికుడు ఒకరు ప్రపంచ రికార్డు బద్ధలు కొట్టినట్లు కీవ్‌పోస్ట్ పత్రిక ప్రకటించింది. 13,000 అడుగుల కంటే ఎక్కువ దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపినట్లు పేర్కొంది. ఇంత దూరం నుంచి గురితప్పకుండా కాల్చడం ఓ ప్రపంచ రికార్డు. స్థానికంగా తయారు చేసిన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌ను వాడి పొక్రొవ్స్క్ ప్రాంతంలో ఇద్దరు రష్యన్ సైనికులను నేల కూల్చినట్లు మీడియా పేర్కొంది. ఇందుకు కృత్రిమమేధ, డ్రోన్ సాయం తీసుకొన్నాడు. ఆగస్టు 14వ తేదీన ఈ ఘనత సాధించాడని మిలిటరీ జర్నలిస్టు యూరి బుట్సోవ్ వెల్లడించారు. పుతిన్‌ట్రంప్ అలాస్కాలో భేటీ కావడానికి ఒక్క రోజు ముందు ఈ రికార్డు నెలకొల్పడం గమనార్హం. ఇటీవల కాలంలో పొక్రొవ్స్క్ ప్రాంతంపై రష్యా దాడులు గణనీయంగా పెరిగాయి. ఈ పట్టణంలో దాదాపు 60,000 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గతంలో అత్యధిక దూరంలో లక్ష్యాన్ని ఛేదించిన చేసిన రికార్డు కూడా 58 ఏళ్ల ఉక్రెయిన్ స్నైపర్ పేరిటే ఉంది. అతడు నాడు 12,400 అడుగుల దూరంలోని రష్యా సైనికుడిని హతమార్చాడు.

# సాగు నీటిపై ప్రజల్ని తప్పదోవ

**మొదటి పేజీ తరువాయి**

"మా రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తై, నీటి కేటాయింపులు ఖరారు అయిన తర్వాతే మిగులు జలాలపై చర్చ జరగాలి. వరద జలాల వినియోగంపై ఇరు రాష్ట్రాల వాటా కేంద్రం తేల్చిన తర్వాతే కొత్త ప్రాజెక్టులు నిర్మించడం సముచితమవుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల అవసరాలే ముఖ్యమని స్పష్టం చేశారు. గోదావరి నదిపై తెలంగాణ చేపట్టిన ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదులు వంటి పలు ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయిన తర్వాతే నీటి వాటాలను పంచి మిగిలిన నీటిని వినియోగించుకోవచ్చని చెప్పారు. "మా అవసరాలు తీరకముందే దిగువప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు కట్టితే భవిష్యత్తులో కేటాయింపుల సమస్యలు తీవ్రమవుతాయి" అని హెచ్చరించారు. అలాగే సముద్రంలోకి వెళ్ళే జలాలపై జరుగుతున్న చర్చల గురించి స్పందిస్తూ - "నీటి వినియోగం గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. అమాయకులు ఎవ్వరూ లేరు, ప్రజలు వాస్తవాలు బాగా అర్థం చేసుకుంటారు" అని అన్నారు. రాష్ట్ర రాజకీయాలపై కూడా భట్టి విక్రమార్క స్పందించారు. "తెలంగాణలో కాంగ్రెస్ బలంగా నిలబడి ఉంది. అసంతృప్తి ఉందని కొందరు సృష్టిస్తున్న ప్రచారం వాస్తవానికి దూరం" అని అన్నారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ విధానాలు విశాల ప్రయోజనాల కోసం ఉంటాయి. సంకుచిత

# పుతిన్ కీలక డిమాండ్..!

**యుద్ధం ముగించాలంటే అలాస్కా భేటీలో కీలక ప్రతిపాదనలు**

**భేటీ అనంతరం జెలెన్‌స్కీ తో ట్రంప్ ఫోన్‌లో మాటామంతి**

**డిమాండ్‌ను జెలెన్‌స్కీ తిరస్కరించినట్లు వెల్లడి**

**నేడు జెలన్ స్కీ తో ట్రంప్.. ఉత్కంఠ**

**జనం పవర్, హైదరాబాద్:**



అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. అక్కడ ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. యుద్ధం ముగించేందుకు పుతిన్ ఓ కీలక డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

యుద్ధం ముగించాలంటే తూర్పున ఉన్న దొనెట్స్క్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ పూర్తిగా వైదొలగాలని ఆయన డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అలాస్కా భేటీ అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తో పాటు యూరోపియన్ నేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో పుతిన్ చేసిన ప్రతిపాదనను అగ్రరాజ్యాధిపతి వారికి వివరించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, ఈ డిమాండ్‌ను జెలెన్‌స్కీ తిరస్కరించినట్లు వెల్లడించాయి.

**రష్యా ఆధీనంలోనే ఎక్కువ భాగం..**

రష్యా సరిహద్దుల వెంబడి తూర్పు ఉక్రెయిన్‌లో డాన్‌బాస్ ప్రాంతం ఉంది. అందులో దొనెట్స్క్, లుహాన్స్క్‌లు అంతర్భాగాలు. పారిశ్రామిక హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో మైనింగ్ కూడా ఎక్కువగానే జరుగుతుంది. బొగ్గు నిల్వలు, ఉక్కు ఉత్పత్తులకు ఈ ప్రాంతం ప్రధాన కేంద్రంగా ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎక్కువ భాగం రష్యా ఆధీనంలోనే ఉంది. 2022లోనే ఈ ప్రాంతంలోని అధిక భాగాన్ని మాస్కో తన సొంతం చేసుకుంది. ఇటీవల మాస్కో బలగాలు ఈ ప్రాంతంలోకి మరింతగా చొచ్చుకు వచ్చాయి. కేవలం 30 శాతం దొనెట్స్క్ ప్రాంతం మాత్రమే ఉక్రెయిన్ ఆధీనంలో ఉంది. ఇప్పుడు మిగిలిన ఆ ప్రాంతాన్ని కూడా తన వశం చేసుకోవాలని మాస్కో భావిస్తోంది. సుదీర్ఘంగా కొనసాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా అలాస్కాలో పుతిన్‌తో భేటీ అయ్యి చర్చలు జరిపారు. వారి మధ్య ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. చర్చలు సానుకూలంగా జరిగాయని పేర్కొన్నారు. ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గమని ట్రంప్ అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం జెలెన్‌స్కీతో ఆయన సమావేశమవుతున్నారు.

# ఏపీలో భారీ వర్షాలు..

**ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్**



**జనం పవర్, హైదరాబాద్:**

దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని, ఈ నెల 19న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ కేంద్రం డైరెక్టర్ భారతి సవ్వడి తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. విశాఖ, అనకాపల్లి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు




# పార్టీలపై ఈసీ ఎలాంటి వివక్ష చూపదు సీఈసీ

**జనం పవర్, హైదరాబాద్:**

ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# భారత్‌లో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

**ఢిల్లీ విమానాశ్రయంలో ఘన స్వాగతం**

**త్వరలోనే ప్రధాని మోడీని కలవనున్న శుక్లా**

**జనం పవర్, హైదరాబాద్:**

అంతరిక్షంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశాన్ని గర్వపడేలా భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకున్నారు. ఢిల్లీ ఐజీఐ విమానాశ్రయంలో ఆయన అడుగు పెట్టగానే ఘన స్వాగతం లభించింది.ఈ సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్, ఇస్రో శాస్త్రవేత్తలు, విద్యార్థుల బృందం, అలాగే పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. భార్య కామ్నా శుక్లా, కుమారుడు కూడా ఆయనతో పాటు ఉన్నారు. ప్రజలు "భారత్ మాతా కి జై" నినాదాలు చేస్తూ, జాతీయ పతాకంతో ఆయనకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఆయనకు పూల గుత్తి ఇచ్చి సత్కరించారు. త్వరలోనే శుభాంశు శుక్లా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలవనున్నారు. తరువాత తన స్వస్థలమైన లక్నోను సందర్శించనున్నారు. ఆగస్టు 22-23 తేదీల్లో ఢిల్లీలో జరగబోయే జాతీయ అంతరిక్ష దినోత్సవం కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.



**అంతరిక్ష యాత్ర వివరాలు**

శుభాంశు శుక్లా జూన్ 25, 2025న అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం కేప్ కెనావెరల్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్‌లో అంతరిక్షానికి బయలుదేరారు. మరుసటి రోజు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం చేరుకున్నారు. ఆయనతో పాటు అమెరికా వ్యోమగామి పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్ ఉజ్నాన్స్కీవిస్నివ్స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు కూడా ఉన్నారు. మొత్తం 18 రోజులు అంతరిక్షంలో గడిపిన శుభాంశు శుక్లా 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలు, 20 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భారత అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయన ప్రధానంగా ఏడు కీలక ప్రయోగాలపై దృష్టి సారించారు.

**ప్రయోగాలు ఇవే...**

అంతరిక్షంలో పచ్చి శనగలు, మెంతుల మొలకలు పెంచడం, మానవ శరీరంపై మైక్రోగ్రావిటీ ప్రభావం అధ్యయనం, కండరాల బలహీనతపై పరిశోధన, మెదడుకంప్యూటర్ ఇంటర్‌ఫేస్ పరిశోధన, ఈ ప్రయోగాలు భారతదేశంలో వ్యవసాయం, ఆరోగ్యం, సాంకేతిక అభివృద్ధి రంగాలలో కొత్త మార్గాలను చూపనున్నాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ అంతరిక్ష మిషన్ కోసం శుభాంశు శుక్లా ఒక సంవత్సరం పాటు అమెరికాలో కఠినమైన శిక్షణ పొందారు. అంతరిక్షంలో సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా ప్రయోగాలు పూర్తి చేయడం ద్వారా భారతదేశానికి శాస్త్రీయ ప్రపంచంలో కొత్త ప్రతిష్ఠను తీసుకొచ్చారు. దేశ ప్రజలు ఆయన విజయాన్ని జాతీయ గర్వంగా భావిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



**జనం పవర్, రామగుండం ఆగస్ట్ 17:**

సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రామగుండం శాసనసభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మేదరి సారయ్య (సిఐటియు), తోకల రమేష్ (టియుసిఐ), మద్దెల శ్రీనివాస్ (టిసికేఎస్) పాల్గొన్నారు.నేతలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, 20 నెలలుగా వేతన పెంపు జరగలేదని, జీవో నం. 22 ను గెజిట్ చేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 22న హైదరాబాద్ ప్రజా భవన్ వద్ద జరిగే కార్యక్రమంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు పాల్గొని మద్దతుగా మాట్లాడాలని కోరారు.ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి,కార్మికుల వేతన పెంపుకు కృషి చేస్తారని చెప్పారు.సంఘాలు కార్మిక సమస్య పరిష్కారానికి కలిసి పోరాటం చేయాలని సూచించారు.కార్మికులు "ఒకే కుటుంబం ,ఒకే లక్ష్యం" సూత్రంతో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సమస్యను సమగ్ర పరిష్కరించాలి అని భావించారు.




## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేత

**జనం పవర్, రామగుండం ఆగస్టు 17:**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. రామగుండం కార్పొరేషన్‌కు చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ.1,11,12,876 విలువైన చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో అందజేశారు. అలాగే ఇప్పటివరకు కేవలం రామగుండం కార్పొరేషన్ పరిధిలోనే రూ.7 కోట్ల 56 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదనంగా 4,687 మంది అర్హులైన వారికి కొత్త తెల్ల రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు.

## కారుకి నిప్పంటించిన గుర్తుతెలియని దుండగులు



**నం పవర్.గంగాధర.ఆగష్టు 17**

గంగాధర మండలంలోని మధురనగర్ గ్రామంలో ఇంటి పక్కన పార్కు చేసి ఉన్న మోతె శ్రీహరి రెడ్డి అనే వ్యక్తి కారుని శనివారం అందదా రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారని బాధితుడు తెలిపారు. తన కారుకి నిప్పంటినట్టు గమనించిన కారు యజమాని శ్రీహరి మంటలను ఆర్పి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని గంగాధర పోలీసులు తెలిపారు.

## గుంతలతో గుబులు, మలుపులతో ముప్పులు



**జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 17:**

పెద్దపల్లి పట్టణంలోని బండారికుంట అంబేద్కర్ సర్కిల్ మూల మలుపు వద్ద రహదారి తీవ్రంగా దెబ్బతిని పెద్ద గుంతల ఏర్పడి వాహనదారులను, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది.గత మూడు నెలలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా పెద్దపల్లి-ధర్మారం రహదారి కావడంతో ఆటోలు, లారీలు, బస్సులు సహా వందలాది వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు రెట్టింపైంది. మూడు కూడళ్ల రోడ్డు మరియు వంకర మలుపు ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రాణ నష్టం సంభవించే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు తరచూ దెబ్బతింటున్నాయని డ్రైవర్లు ఆవేదన చెందుతుండగా, పాఠశాల-కాలేజీ విద్యార్థులు కూడా గుంతలతో నిండిన ఈ మార్గంలో నిత్యం ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారని తెలిపారు. రోడ్డు పరిస్థితిని గమనించి తక్షణమే చర్యలు తీసుకొని గుంతలను పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# భద్రత బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ విధానం

**పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు**



**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 17**

పోలీసు శాఖ రూపొందించిన గణేష్ మండప నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని, ఈ సమాచారం ద్వారా భద్రత. బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని. ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు ముందస్తు పోలీసుస్టేషన్లో సమాచారం ఇవ్వాలని అందుకోసం ఏదైనా కంప్యూటర్, మొబైల్ నందు అప్లై చేసుకోవాలని అన్నారు. అందుకొరకు హెచ్టీటీపి://పోలీస్ పోర్టల్.టీఎస్ పోలీస్.గౌట్. ఇన్ అనే సైట్ నందు వివరాలు పొందు పరచి అప్లికేషన్ ను సంబంధిత పోలీస్ స్టేషన్ నందు అందించాలని సూచించారు. వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసే వారికి జగిత్యాల జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తితో భద్రత, బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం. గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలన్నారు. గణేష్ మండపాలను ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ శాఖ వారి అనుమతి పత్రంతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. మండపాలకు పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే, ప్రతి మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. మండపంలో 24 గంటలు 4గురు వాలంటరీ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకొని భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటరీలను నియమించాలన్నారు. గణేష్ ప్రతిమలు కూర్చోబెట్టే ప్రదేశంలో షెడ్డు నిర్మాణం మంచి నాణ్యతతో ఏర్పాటు చేసుకోవాలి, షార్ట్ సర్క్యూట్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తతో, ఫైర్ ఎక్సటింగుషేర్ డ్రమ్ముల్లో నీరు, ఇసుకను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల్లో మరియు శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లో డీజే లను ఏర్పాటు చేయరాదన్నారు. విద్యా సంస్థలకు, హాస్పిటల్స్ కు, ప్రార్థన మందిరాలకు, వృద్ధులకు, చిన్న పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే చిన్న స్పీకర్లను పోలీస్ శాఖ వారి అనుమతితో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద భక్తి గీతాలు మాత్రమే ప్లే చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడడం, అసభ్యకరమైన నృత్యాలు ఏర్పాటు చేయడం, ఇతరులను కించపరిచే విధంగా ప్రసంగాలు, పాటలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం. ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా మండపాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం పూర్తిగ నిషేధం. మండపాల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమలు నిర్వహించేటప్పుడు పోలీసు వారికి ముందుగానే తెలియపరచాలన్నారు. తద్వారా మండపాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా పోలీస్ శాఖ చూసుకోవడం జరుగుతుందన్నారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజున నిర్దిష్ట సమయానికి విగ్రహాలను మండపానికి చేరుకునే విధంగా నిర్వాహకులు చూసుకోవాలి.మధ్యాహ్నం నుండే గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించి నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తయ్యే విధంగా మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజున మరియు నిమజ్జనం రోజున నిర్వాహకులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలిగించకుండా శోభాయాత్రను నిర్వహించుకోవాలన్నారు. గణేష్ శోభాయాత్ర సమయంలో ఇతరులపై రంగులు చల్లడం చేయకూడదు.శోభయాత్ర సమయంలో ఇతరులను కించపరిచే విధంగా స్లొగన్స్ చేయకూడదు. శోభయాత్ర సమయంలో టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధమన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రుమర్స్, వదంతులు నమ్మకూడదు ఎలాంటి సందేహం ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100 కి సమాచారం అందించాలన్నారు. మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చే పోలీస్ శాఖ గణేష్ మండపల వద్ద, శోభాయాత్రలో మహిళలకు, పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. గణేష్ శోభాయాత్రకు ఉపయోగించే వాహనాలను సరైన కండిషన్లో ఉండాలి , అదేవిధంగా డ్రైవర్ కు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనం సంబంధించిన పేపర్స్ ఉండాలన్నారు. గణేష్ మండపాలో పాయింట్ బుక్స్ ను ఏర్పాటు చేసుకోవాలి. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో పోలీస్ శాఖ వారు మండపాలను పర్యవేక్షిస్తారు వారికి సహకరించాలన్నారు. పోలీసు వారు సూచించిన పై నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరగడానికి పోలీసు వారికి సహకరించవలసిందిగా కోరారు.



## మంథని గౌతమేశ్వర తీరంలో పరవాలను తొక్కుతున్న గోదావరి

**జనం పవర్, మంథని, ఆగస్టు 17:**

మంథని గౌతమేశ్వర తీరం వద్ద గోదావరి నది పరవళ్ళు తొక్కుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదలడంతో వరద గోదావరిని తాకింది. దీంతో గౌతమేశ్వర తీరం వద్ద గోదావరి నిండుగా ప్రవహిస్తున్నది. గోదావరి ప్రవాహాన్ని చూసేందుకు మంథని, పరిసర గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. గోదావరి నది తీర సమీప గ్రామాల మత్స్యకారులు, పశుకాపరులు, వ్యవసాయదారులు గ్రామస్తులు ఎవరు కూడా గోదావరి నదికి వెళ్ళవద్దని మంథని ఎస్ఐ, దేగ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు..

## అంబేద్కర్ భవిష్యత్ తరాలకు ఆశా కిరణం

**ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు భోగ శ్రావణి**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 17**



జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రతి ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగ శ్రావణి పాల్గొని పూలమాలతో నివాళ్లు అర్పించి అంబేద్కర్ ను స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా భోగ శ్రావణి మాట్లాడుతూ.. దేశంలోని సబ్బండ వర్గాలకు అంబేద్కర్ నాయకుడని కొనియాడారు. ప్రపంచంలోని అతిపెద్ద రాజ్యాంగం లికించి కార్మికులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చట్టాలతో రక్షణ కల్పించారన్నారు. చిన్న కుటుంబంలో పుట్టి అంటరానితనం అనే వివక్షతకు బలై కనీసం మంచి నీరు కూడా తాగలేని పరిస్థితి ఎదురుకొన్నారన్నారు. చదువుకోవడానికి ఒక మూలన కూర్చోపెట్టడం ఓర్చుకొని ప్రపంచంలోనే పెద్ద గ్రంథాలయంలోని పుస్తకాలు చదివారన్నారు. చిన్న గుడిసెలో ఉద్భవించిన నిప్పు రవ్వ మహోజ్వల జ్యోతి అయ్యి దేశంలోని అడుగు బలహీన వర్గాలకు మార్గదర్శకం చేశారన్నారు. భవిష్యత్ తరాలకు ఆశా కిరణంగా ఉన్నారన్నారు. అంబేద్కర్ రచనలు చదువుతుంటే రోమాలు నిక్కబడుచుకుంటాయన్నారు. ఒక నవల చదివి అంశాలను పేజీతో సహా గుర్తుపెట్టుకొన్న వారి మేధస్సు చాలా గొప్పదన్నారు. ప్రత్యేకించి మహిళలు పని ప్రదేశంలో రక్షణలు ఉండాలని రాజ్యాంగంలో కల్పించారని అన్నారు. ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమం నిర్వహిస్తున్న నల్ల శ్యామ్ కు అభినందనలు తెలుపడంతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు ద్యావర సంజీవరాజ్, ప్రధాన కార్యదర్శి మేనేమి రవీందర్రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, మద్దెల నారాయణ, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు. కస్తూరి సత్యం, తరాల మహేష్, దూరిశెట్టి మమత, గడ్డల లక్ష్మి, మ్యాకల లక్ష్మి, సోమ లక్ష్మి, కశేటి తిరుపతి, మామిడాల కవిత, కందుకూరి నారాయణ, అక్కినపల్లి కాశీనాథ్, అనంతుల కాంతారావు, దువాసు రమేష్, మల్లికార్జున్, తక్కల దేవయ్య, బొల్లం ప్రభాకర్, దాసరి లచ్చయ్య, నల్ల సురేష్, కంటె అంజయ్య, బాలరాజ్. తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు పచ్చి అబద్ధం

**నమ్మి ఓట్లేస్తే మమ్ములను నట్టేట ముంచింది సర్కార్**

**కేసీఆర్ పాలననే నయం అంటున్న రైతులు**

**జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ గారు.**



**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 17**

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు పచ్చి అబద్ధం అని రైతులు, ప్రజలే గుర్తించారని, ఇది ప్రతిపక్షాల ఆరోపణ కాదని, ప్రజల ఆవేదన అని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జగిత్యాల మండలంలో పలు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించిన అనంతరం తిరిగి వస్తుండగా లక్ష్మీపూర్ చెరువు కట్ట వద్ద కూర్చున్న గ్రామ రైతులు, ప్రజలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. రైతు భరోసా సక్రమంగా రాలేదని, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను వంచిస్తూ ఇందిరమ్మ పాలన పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. 20 నెలల కాలంలో కొత్త పెన్షన్ లు ప్రారంభించలేదని, తులం బంగారం ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చెయ్యడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, హామీలు నెరవేర్చువరకు ప్రజల పక్షాన అండగా ఉండి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట రూరల్ మండల అధ్యక్షులు ఆనంద్ రావు. మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్. నాయకులు హరీష్. నరేష్. గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## ఆదివాసి హక్కుల బహిరంగ సభకు కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ




**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 17:**

తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఈ నెల 24న వరంగల్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ విజయవంతం కావాలనే పిలుపుతో పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. జిల్లా కన్వీనర్ ముడి మడుగుల మల్లన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మధ్య భారతదేశంలో ఆదివాసీలపై జరిగిన హత్యాకాండలను నిరసిస్తూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, పోలీస్ క్యాంపులను తొలగించాలని, 1/70 యాక్ట్, అటవీ హక్కుల పరిరక్షణ చట్టం, పేసా చట్టం, గ్రామసభ తీర్మానాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసుల జీవన హక్కులను రాజ్యాంగం గౌరవించాల్సిందిగా, దేశ సంపద కేవలం కొందరు కార్పొరేట్‌లకే పరిమితం కాకుండా ప్రజలందరికీ సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. సభలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, హనంకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఆదివాసీ హక్కుల కార్యకర్తలు, పౌరహక్కుల సంఘాల నాయకులు, వామపక్ష నాయకులు, రాష్ట్ర నాయకులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళాలు,దళిత సంఘాలు పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణలో పిడిఎం, రైతాంగ సమితి, పౌరహక్కుల సంఘం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే చేతుల మీదుగా 17 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

**నం పవర్ జగిత్యాల ఆగస్టు 17:**

జగిత్యాల పావని కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ సంయుక్తంగా జగిత్యాల నియోజకవర్గ నిరుపేదలైన 17 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించాయి. ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ఉచిత కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. డా. విజయ్, నక్కల రవీందర్ రెడ్డి, మహేశ్వర్ రావు, రాజేశ్వర్ రెడ్డి, ప్రకాశ్, ఏనుగుల రాజు, మణి, మున్నా, హాస్పిటల్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు మాజీ మంత్రి భూమిపూజ


**జనం పవర్ జగిత్యాల ఆగస్టు 17:**

తెలంగాణలో పదేళ్ల తర్వాత ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తుందని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామంలో దారు తిరుపతికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్య



క్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన ఆర్టీఏ?





*** పెద్దపల్లి ఆర్టీఏలో త్వరలో భారీ ప్రక్షాళన**

*** ఏళ్లుగా పాతుకుపోయిన సిబ్బందిని బదిలీ చేయనున్న అధికారులు**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 17:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) కార్యాలయం పనితీరుపై వస్తున్న తీవ్ర ఆరోపణల నేపథ్యంలో విస్తృత స్థాయిలో మార్పులు జరగనున్నట్టు విశ్వసనీయ సమాచారం. సుదీర్ఘ కాలంగా ఇక్కడే పని చేస్తు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన సిబ్బందిని ఇతర ప్రాంతాలకు ఉన్నతాధికారులు బదిలీ చేస్తున్నట్లు సమాచారం.ప్రతి పనికీ డబ్బులు తీసుకోవడం, కోడ్ బాషలో వ్యవహరించడం, బ్రోకర్ల ఆధిపత్యం ఆర్టీఏ కార్యాలయాన్ని పూర్తిగా అవినీతి మయంగా మార్చినట్లు స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ లక్షల్లో రూపాయలు చేతులు మారుతున్నాయన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. అర్హతలన్నీ ఉన్నా డ్రైవింగ్ లైసెన్స్ కోసం తప్పనిసరిగా లంచం చెల్లించక తప్పదని వాహనదారులు వాపోతున్నారు. పైసలు ఇవ్వనిదే ఫైల్ కదలదన్న మాట సామాన్యుల నోళ్లలో నానుతోంది.ఇప్పటికే కార్యాలయం అవినీతి అంశంపై వార్తా కథనాలు వెలుగులోకి రావడంతో గత నెలలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరపడం కలకలం రేపింది. అయినా సిబ్బంది పనితీరులో ఎలాంటి మార్పు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. సీనియర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఆదేశమే తుదిపలుకుగా మారిందని, ఆయన మాటే చట్టంగా అమలవుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతేకాకుండా బయటి వ్యక్తులు కూడా కార్యాలయ పనుల్లో భాగమై లోపల, బయట కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని సమాచారం.ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆర్టీఏ సభ్యులు, ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశం వెళ్లడంతో కార్యాలయాన్ని పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన సిబ్బందిని బదిలీ చేసి, కొత్త అధికారులను నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం. త్వరలోనే పెద్దపల్లి ఆర్టీఏ కార్యాలయంలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నట్టు తెలుస్తోంది.

# వృద్ధ మహిళ మిస్సింగ్

**జనం పవర్ – గంగాధర, ఆగస్టు 17:**

మధురానగర్ గ్రామానికి చెందిన పెగూడ మల్లవ్వ (w/o నాంపెల్లి) అనే వృద్ధ మహిళ అదృశ్యమైంది. నిన్న (16.08.2025) మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆచూకీ తెలియకపోవటంతో ఆమె తమ్ముడు ఈరవేణి రాయమల్లు గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గంగాధర ఎస్ఐ బి.వంశీ



కృష్ణ కేసు నమోదు చేసి, వృద్ధ మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

# సర్వాయి పాపన్న గౌడ్

**375వ జయంతి సందర్భంగా స్పెషల్ స్టోరీ**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 17:**

సర్వాయి పాపన్న గౌడ్ పేరు తెలంగాణ చరిత్రలో ఓ చిరస్మరణీయ అధ్యాయం. 17వ శతాబ్దం చివరి దశలో ఆయన వీరత్వం, ప్రజాప్రేమ, స్వాతంత్ర్యాసక్తి తెలుగు నేలను కదిలించాయి. తెలుగు వీరవనితలతో పాటు స్వాతంత్ర్య సమరయోధులలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ మహనీయుడు సాధారణ గౌడ్ కుటుంబానికి చెందినవారు. కానీ పాలక వర్గాల దౌర్జన్యాలు, ముస్లిం సర్కార్ల అణచివేత, జమిందార్ల దౌర్జన్యాలు చూసి నిశ్శబ్దంగా ఉండలేక ఆయుధం ఎత్తి స్వరాజ్య యాత్ర ప్రారంభించారు. తెలంగాణలోని కూలీలు, పేదలు, రైతులు, వెనుకబడిన వర్గాలను తన చుట్టూ సమీకరించి ప్రజా యోధుడిగా అవతరించారు. ఆయన పోరాటం కేవలం పాలకులకు ఎదురు తిరగడం మాత్రమే కాదు, ప్రజలకు గౌరవం, న్యాయం, సమానత్వం సాధించాలనే ఉద్దేశంతో సాగింది.పాపన్న గౌడ్ బలమైన కోటలను నిర్మించి స్వయం పాలనకు పునాది వేశారు. ఆయన ఏర్పాటు చేసిన పరిపాలనా విధానం ప్రజల అవసరాలకు దగ్గరగా ఉండేది. పన్నులను తగ్గించి, శ్రమజీవులకు భరోసా కల్పించి, అన్నివర్గాల వారిని సమానంగా చూడడం ఆయన పరిపాలనా ప్రత్యేకత. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన నాయకత్వం ద్వారా వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం పెరిగింది. మతం, వర్గం అనే భేదాలను తొలగించి ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి పాలక వర్గాలపై నిరసన వ్యక్తం చేశారు. ప్రజలే బలమని నమ్మి చేసిన దండయాత్రలు పాలకులకు ముక్తకంఠంతో సవాల్ విసిరాయి. తెలంగాణలో మొదటి స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన చరిత్రలో నిలిచారు. ఆయన పోరాటం కేవలం రాజకీయ స్వేచ్ఛకే పరిమితం కాలేదు. సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన, సాధారణ ప్రజల సంక్షేమం ఆయన



లక్ష్యాలు. అదే కారణంగా ఆయనను ప్రజలు నిజమైన నాయకుడిగా, ప్రజల రక్షకుడిగా కీర్తించారు. నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. అన్యాయం, దౌర్జన్యం, అసమానతను ఎదుర్కోవడానికి సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గం ఆచరణీయమైనది.



# ప్రమాదకర రహదారి ఎవరి బాధ్యత..?

**జనం పవర్, గంగాధర, ఆగస్టు 17:**

గంగాధర గ్రామం నుండి ఇస్తారుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మార్గాన్ని తరచూ వినియోగించే వాహనదారులు గత కొద్ది రోజులుగా రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. వర్షాకాలం కారణంగా రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రహదారిని మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేశారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..నిర్మాణానికి మహిళా సంఘాల సభ్యులకు లక్ష రుణం**

**ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 17**

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన బోగ సత్తెమ్మ, కోడిపల్లి నర్సమ్మ, జంగా సుజాత కు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు,అలాగే గుట్రాజ్ పల్లి గ్రామంలో కొడికెల సుజాత ఇందిరమ్మ ఇల్లుకు భూమిపూజ చేసి, జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం సంఘం పల్లి, సోమన్ పల్లి, అనంతారం, గుట్రాజ్ పల్లి, తిమ్మాపూర్, ధర్మారం గ్రామాలలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 82 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ధర్మారం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 17 లక్షలతో నిర్మించిన, అదనపు తరగతి గదులను. వంటగది, మరుగు దొడ్లను ఎమ్మెల్యే డా.సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమథకాలు అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందనుందని, ఈ నిధులను నాలుగు విడతల్లో ప్రభుత్వం లబ్ధిదారుల అకౌంట్లో జమ



చేస్తామని అన్నారు. ఇంటి నిర్మాణ స్థలం కలిగి ఉన్న కుటుంబాలకు మొదటి విడతలో అందజేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజురుచేస్తామని ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మౌలిక సదుపాయాలు మెటీరియల్స్ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేసి, ప్రమోషన్లకు పచ్చజెండా ఊపారన్నారు.ప్రభుత్వ పాఠశాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం పరిచయం చేసి, బోధన చేయటం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి నిధులు మంజూరయ్యాని అన్నారు. ఉచిత బస్సు, ఉచిత కరెంట్, రైతు భరోసా, రుణ మాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రితో కలిసి పనిచేసి జగిత్యాల అభివృద్ధి కి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో విద్య వైద్యం వ్యవసాయం పెద్దపీట. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు. నేషనల్ హైవే పరిధిలో ఉన్న అనంతారం బ్రిడ్జి విషయం లో ఎంపీ అరవింద్ దృష్టికి, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్తానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాములు నాయక్, ఎమ్మార్వో అరుణ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ గాయత్రీ, ఏఈ రాజమల్లయ్య, సీనియర్ నాయకులు ముస్కు ఎల్లారెడ్డి, మహేశ్వర్ రావు, బాలముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, రౌతు గంగాధర్, మాజీ సర్పంచ్ లు మల్లవ్వ మల్లయ్య, అంజన్న, లక్ష్మణ్, మాజీ ఎంపిటిసి గిద్దె శంకర్, రాజేశ్వర్ రెడ్డి, ప్రకాశ్, చిర్ర నరేష్, శ్రీను, సురేందర్, మహేష్, భూమన్న, సత్యనారాణ, గంగరాజం, సురేష్, మోహన్ రెడ్డి, రంజిత్, రాజేందర్, రాజేష్, ధనేశ్వర్ రావు, సాగర్, గ్రామ మండల నాయకులు, గ్రామ కార్యదర్శులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు .





# చెత్త కుప్పల మధ్య కూరగాయల మార్కెట్

**దోమలు, పందుల స్వైర విహారం**

**ప్రజల ఆరోగ్యంపై అధికారుల నిర్లక్ష్యానికి బలిపశువులేనా?**

**వ్యాపారుల ఆవేదన,కొనుగోలుదారుల అసహనం**

**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 17:**

పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన మార్కెట్‌యార్డు ప్రాంతం ప్రజలకు కూరగాయలు అందించే కేంద్రంగా ఉన్నప్పటికీ, అక్కడి శుభ్రతా పరిస్థితులు చాలా దయనీయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రతిరోజూ చాలా మంది కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే ఈ ప్రాంగణంలో మిగిలిన కూరగాయలను ఒకేచోట పోసేయడం వల్ల చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది.వర్షాల వలన నీరు నిల్వ కావడం వల్ల ఆ చెత్త దోమలకు నేలవై మలేరియా,డెంగీ,చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ సమస్యతో పాటు పందులు స్వైర విహారం చేస్తూ చెత్తలో తిరుగుతూ,కనిపిస్తుండటంతో పరిశుభ్రతా పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయి.కూరగాయలు కొనడానికి వచ్చే మహిళలు,వృద్ధులు,చిన్నపిల్లలు ఈ దృశ్యాలను చూసి భయాందోళనలకు గురవుతున్నారు,కొనుగోలు చేసిన కూరగాయలను శుభ్రం చేయకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు ఈ సమస్యపై ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ,శుభ్రత లేమి కారణంగా వ్యాపారం కూడా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కూడా కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో మురికివాసన, దోమల దాడులు,పందుల సంచారం వల్ల భయాందోళన చెందుతున్నామని, ఇలాంటి వాతావరణంలో మార్కెట్‌కు రావడం కష్టమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం సమస్యపై నిశ్శబ్దం పాటించడం ప్రజల్లో తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. చెత్తను తొలగించి శానిటేషన్ చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింత విషమించి మార్కెట్ వ్యాధుల కేంద్రముగా మారిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణ పరిశుభ్రతకు అద్దం పడే ప్రదేశంగా ఉండాల్సిన మార్కెట్‌యార్డు ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ శాసన వ్యవస్థ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తోంది. చెత్త సమస్యను తక్షణం పరిష్కరించి, దోమల నివారణ చర్యలు చేపట్టకపోతే ప్రజల ఆరోగ్యం తీవ్రమైన ముప్పుకు గురవుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శంకుస్థాపన

**జనం పవర్ జగిత్యాల ఆగస్టు 17:**

జగిత్యాల రూరల్ మండలం సంఘంపల్లి, సోమన్‌పల్లి, అనంతారం, గుట్రాజ్‌పల్లి, తిమ్మాపూర్, ధర్మారం గ్రామాలలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద రూ.82 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ధర్మారం గ్రామంలో రూ.17 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఆశల సౌధం.. అరచేతిలో వైకుంఠం





(జనం పవర్, వరంగల్ బ్యూరో) సగటు జనం ఆశల సౌధం లో విహరిస్తోంది.. అయ్యేది కాదు పోయేది కాదు. అయినా ఆశలు రేకెత్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సోషల్ మీడియాలో ప్రచారాలు మనిషిని కోరికల వైపు నెడుతోంది. గత రెండు మూడు రోజులుగా పాత నాణేలు (పైసలు) లేదా నోట్లు లక్షల్లో విలువ చేస్తున్నట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. సెల్ ఆన్ చేస్తే అవే ప్రచారాలు. మనిషిని ఊహా లోకంలోకి నెట్టేస్తున్నాయి. ఈ నాణేనికి ఇంత, ఆ నోటుకు ఇంత ఇస్తాం ఇంకా నేరుగా ఇంటికొచ్చి ఇస్తామని చెబుతుండటంతో "హమ్మయ్య" ఇదే నిజమైతే అప్పులు తీరుతాయి. భూమి కొనుక్కొని ఎంచక్కా ఇల్లు కట్టుకోవచ్చు" అని కొందరు ఆశావహులుఉవ్విళ్లూరుతున్నారు. కొందరు అభాగ్యులు మనసులోని మాటను కూడా బయటికి చెప్పలేక వ్యక్తిగత స్వార్థాన్ని చాటుకుంటున్నారు. కాలం చెల్లిన నాణెం, పాత నోట్లకు లక్షల్లో విలువ పలుకు తుండ టంతో ఇదేదో బా గానే ఉందని ఎవరికి వారు వాటి సేకరణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అనేక ఇబ్బందులెదు ర్కొంటున్నారు. అంతేకాదు కొందరు వాటి కోసం సదరు వ్యక్తిని బోల్తా కొట్టించి అంతో ఇంతో చేతిలో పెట్టి వాటిని తెచ్చుకుంటున్నట్లు తెలిసింది.పాత నాణేలు, నోట్ల సేకరణ విషయంలో చాలా వరకు జనం తల మునకలవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఫేస్‌బుక్‌లో ఈప్రచారం చక్కర్లు కొడుతోంది. ప్రచారాలు గుప్పిస్తున్న కొందరు సంప్రదించాల్సిన నెంబర్లు అంటూ సెల్ నెంబర్లు కూడా ఇస్తున్నారు. ఫోన్ చేస్తే సమాధానంరాదు. స్విచ్ ఆఫ్, ప్రస్తుతం ఈనెంబర్ పనిచేయడం లేదు వంటి సమా ధానంతో సదరు ఆశావహులపై చన్నీళ్ళు చల్లినట్లవుతోంది. ఏఒక్కరు ఫలితాలు పొందిన దాఖలాలు లేవు.

# మెరుపు నివారణ పరికరాలను అమర్చుకోవాలి





**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 17:** నెల రోజుల నుండి ఎడతెరిపి లేని వర్షాలు, వాటి కారణంగా ఉరుములు మెరుపులతో కూడిన విద్యుత్ ప్రకంపనాలు తరచూ సంభవిస్తున్నాయి. గత సంవత్సరం కూడా ఉరుములు మెరుపుల కారణంగా పిడుగులు పడి ప్రాణ నష్టం, మూగ జీవులైన పశువులు, గొర్రెలు ప్రాణాలు కోల్పోవడం జరిగి నది. గతవారం నుండి కూడా ఉరుములు, మెరుపులు విపరీతంగా సంభవిస్తున్నాయి. వనపర్తి జిల్లాలో గ్రామాల లో, పట్టణాలలో లైటెనింగ్ అరెస్టర్లు (మెరుపు నివారణ పరికరాలు) నీటి ట్యాంకులపై లేకపోవడం లేదా ఉన్నవి పనిచేయ కపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు లేదా ప్రమా దాలకు కారణ మవుతున్నాయి. అందుచే మునిసిపల్ ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, గ్రామీణ నీటి సరఫర అధికారులు వెంటనే లైటెనింగ్ అరెస్టర్లు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. మెరుపు అరెస్టర్లు అనేవి మెరుపుల వల్ల కలిగే నష్టాల నుండి భవనాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇతర పరికరాలను రక్షించడానికి ఉపయోగించే పరికరాలు. ఇవి మెరుపును భూమిలోకి మళ్ళించి, నష్టాన్ని నివారిస్తాయి. పని చేసే విధానం మెరుపు అరెస్టర్లు, అధిక వోల్టేజ్ టెర్మి నల్, గ్రౌండ్ టెర్మినల్ కలిగి ఉంటాయి. మెరుపు సంభ వించినప్పుడు, అది అధిక వోల్టేజ్ టెర్మినల్ ద్వారా అరెస్టర్‌లోకి ప్రవేశిస్తుంది.

త్వరగా భూమిలోకి మళ్ళించ బడుతుంది. దీనివల్ల పరికరాలు, భవనాలకు నష్టం జరగకుండా నిరో ధించవచ్చు. ఉపయోగాలు మెరుపు అరెస్టర్లు విద్యుత్ వ్యవ స్థలు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు, భవనాలు, ఇతర పరి కరాలను మెరుపు దెబ్బల నుండి రక్షించడానికి ఉపయోగి స్తారు. ఇవి ముఖ్యంగా ఉరుములు, మెరుపులు ఎక్కువగా వచ్చే ప్రాంతాలలో చాలా ముఖ్యమైనవి. మెరుపు అరెస్టర్లు వివిధ రకాలుగా ఉంటాయి,

రాడ్ రకం మెరుపు అరెస్టర్లు, గ్యాప్‌రకం మెరుపు అరెస్టర్లు, ఆక్సైడ్ వాల్వ్ మెరుపు అరెస్ట ర్లు. మెరుపు అరెస్టర్లు పరికరాలను, భవనాలను మెరుపు వల్ల కలిగే నష్టాల నుండి రక్షించడంలో కీలక పాత్ర పోషి స్తాయి. ఇవి విద్యుత్ వ్యవస్థల యొక్క విశ్వసనీయ పెంచడానికి, నష్టాలను నివారించడానికి సహాయపడతాయి.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి






## కాంగ్రెస్ సోషల్ మీడియాకు ఎమ్మెల్యే వత్తాసు

**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 17:** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న నాయకులపై దాడిని ఎమ్మెల్యే కట్టడి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అంబటి.రమేష్ పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను రాజానగరం ప్రజల ముట్టడి చేశారు.చట్టపర చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ చౌరస్తాలో బి.ఆర్.ఎస్ మెరుపు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పెయిడ్ వర్కర్స్ సోషల్ మీడియా వేదికగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులపై వ్యక్తిగతంగా దూషణలకు పాల్పడుతున్న అంబటి.రమేష్ పై చర్యలు తీసుకోవాలని రాజానగరం ప్రజలు మూకుమ్మడిగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి చేయడం జరిగింది. ఎమ్మెల్యే అధికారంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కరించడం చేతకాక పెయిడ్ ఆర్టిస్టులను పెట్టుకొని ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నాయకుల మీద వ్యక్తిగత దూషణలు చేయించడాన్ని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, మాజీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు.జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ మాట్లాడుతూ మా నాయకుడు నిరంజన్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేయకుండా ప్రజా సమస్యలపై పోరాడమని ఒకవైపు చెబుతుంటే.కాంగ్రెస్ సోషల్ మీడియా ముసుగులో ప్రశ్నించే నాయకులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగతంగా బహిరంగ దూషణలు చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పెయిడ్ ఆర్టిస్టులను ఎమ్మెల్యే ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. స్వయంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నాయకులు కలసి జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయడం జరిగింది అని ఎస్పి సంయమనం పాటించండి అని చెప్పడంతో వారిపై గౌరవం ఉంచి బిఆర్ఎస్ మౌనంగా ఉంటే కాంగ్రెస్ వారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. తీవ్ర కోపోదిక్రుతులైన రాజానగరం ప్రజలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దాక్కున్న అంబటి రమేష్ పై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు.నిరసనగా అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ కార్యక్రమములో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,ఉంగ్లం. తిరుమల్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, కరుణాకర్, అంజి సాగర్,నక్క.వెంకటయ్య, నక్క.చంద్రయ్య,కాటమోని. బాలస్వామి, గుడ్డేటి.బాలస్వామి,నక్క. గోపాల్, లక్ష్మీ, పుల్లమ్మ, సూర్యవంశం, గిరి, యుగంధర్ రెడ్డి, చిట్యాల రాము, జోహెబ్ హుస్సేన్, బాలచంద్రయ్య,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ జిన్నారం(ఆదర్శ)ఆవిష్కరణ

**జనం పవర్, పటాన్చెరు (జిన్నారం), ఆగష్టు 17:** లయన్స్ క్లబ్ ఆఫ్ జిన్నారం(ఆదర్శ) ఆవిష్కరణ ఆదివారం కొంపల్లిలో ఘనంగా నిర్వహించారు. కొంపల్లిలో జరిగిన 20వ డిస్ట్రిక్ట్ కేబినెట్ ఇన్స్టలేషన్ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిన్నారం ఆవిష్కరణతో పాటు, లోగో ఆవిష్కరణ సర్టిఫికెట్ లను నూతన క్లబ్ ఛైర్మెన్ ఆనంద్, వైస్ ప్రెసిడెంట్ కరుణాసాగర్ రెడ్డి, ట్రెసరర్ ప్రభాకర్ రెడ్డిలకు అందజేశారు.లయన్స్ క్లబ్ ఆఫ్‌నర్సాపూర్ స్నేహబందు చైర్మెన్ రాఘవేంద్ర రావు,జనరల్ సెక్రటరీ నలగండ్ల అశోక్‌లు క్లబ్ ప్రోత్స హించి ముందుకు నడిపిస్తున్నారని నూతన లయన్స్ క్లబ్ జిన్నారం చైర్మన్ ఆనంద్ తెలిపారు.




## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 17:** ఈనెల 16న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 15 వాలీబాల్ సెలక్షన్ లలో బాలుర విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెద్దమందడిలో 10వ తరగతి చదువుతున్న పి కోమల్ పాల్గొని ప్రతిభ కనబరిచి ఈనెల 18 ,19 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఏఏపిసి చైర్మన్,ఉపాధ్యాయ బృందం, గ్రామపెద్దలు అభినందించారు.ఈ సందర్భంగా హెచ్ఎం శాంతన్న మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి మన జిల్లాకు, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అవ్వ బాగున్నావా...

### ఆప్యాయంగా పలకరించిన ప్రణవ్



**జనం పవర్, జమ్మికుంట, ఆగష్టు 17:** హుజురాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో కూరగాయలు అమ్ముకుంటున్న ఓ అవ్వను చూసి ఆప్యాయంగా పలకరించారు హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్.శనివారం రాత్రి జమ్మికుంటకు వస్తున్న క్రమంలో అవ్వను చూసి కార్ ఆపి ముచ్చటించి, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కూరగాయల వ్యాపారంలో ఆదాయం, రాబడి ఎంత ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగారు. అనంతరం కూరగాయలు కొనుగోలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే తెలియజేస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**జనం పవర్, జమ్మికుంట, ఆగష్టు 17:** జమ్మికుంట పట్టణంలోని దుర్గా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ చాతి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ విజేత రెడ్డి 100 మంది రోగులకు చాతి సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, చాతి ఎక్స్-రే, స్పైరోమెట్రీ,ఈసీజీ లాంటి పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ విజేత రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మాస్కులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు ఎస్ విజేత రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ పి కిరణ్ గౌడ్, తిప్పని హేమంత్ గౌడ్, హాస్పటల్ సిబ్బంది వినీత్, సంపత్ రావు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

### పరామర్శించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జనం పవర్, జమ్మికుంట, ఆగష్టు 17:** హుజురాబాద్ బతుకమ్మ సొల్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సందీప్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుటాహుటిన హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, మార్చురీలో సందీప్ మృతదేహాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మృతుడి కు టుంబ సభ్యులను ఆత్మీయంగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుం బానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇస్తూ, సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

# అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

- పెరిగిన వాహనాల రద్దీ
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు



**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 17:** వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పనిచేయకపోవడంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో రద్దీ పెరగడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. తక్షణమే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాహనాల రాకపోకలపై నియంత్రణ లేకపోవడం సమస్యగా మారింది. రద్దీ బాగా పెరగడం, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటం, వాహనాలను పట్టణంలోని ప్రధాన రాహదారిపై అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తు తున్నాయి. పట్టణంలో ప్రధాన కూడలి రాజీవ్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసినా అది ఎప్పుడు పనిచేస్తుందో లేదో కూడా తెలియదు. ఇతర కూడళ్లలో సిగ్నల్స్, పోలీసులు లేకపోవడంతో వాహనాలను ఇష్టారీతిలో నడుపుతున్నారు. వనపర్తి జిల్లాగా ఏర్పాటు చేసిన తరువాత పట్టణంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వచ్చేవారు. పరిసర మండలాల నుంచి వివిధ అవసరాల కోసం వస్తుండ టంతో పట్టణంలో రద్దీ బాగా పెరిగింది. బస్టాండ్ దగ్గర రహదారి ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అక్కడే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయక పోవడం, ఆ పరిసరాలలో పోలీసుల ఆనవాళ్లు కూడా కనిపించకపోవడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. అదే విధంగా గాంధీ చౌక్, అంబేద్కర్ , వివేకానంద చౌరస్తాలలో కూడా ఇదే పరిస్థితి. ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసుల సతమతం అవుతున్నారు. రోడ్డు దాటాలంటే వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో చాలా కాలంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ పని చేయడం లేదు. దీంతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఆలంకారప్రాయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పని చేయక మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు, ఇష్టాను సారంగా వాహన రాకపోకలతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా పనిచేసేలా చూడాల్సిన అవసరం ఉంది,తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# పరమాత్ముని సేవలో తృప్తి ఉంటుంది



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 17:** పరమాత్ముని సేవలో ఉన్న తృప్తి దేనిలో ఉండదని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో సత్సంగంలో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, హరీష్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతు పరమాత్ముని సేవలో ఉన్న తృప్తి దేనిలో ఉండదని, శ్రీ కృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడ దుఃఖం ఉండదని బాధలు తొలగుతాయన్నారు. అ స్వామి దీవెనతో అన్నింటా మంచి జరగాలని ఆకాంక్షించారు..

## ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా బాబురావు సతీష్



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 18:**ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ బాబురావుఎంపికయ్యారు. ప్రపంచ ఫోటోగ్రఫీ 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో ఆంధ్రజ్యోతి సిద్దిపేట జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా బి బాబురావు ఎంపికయ్యాడు ఈనెల 19న హైదరాబాద్ గ్రీన్‌పార్క్ హొటల్లో నిర్వహించే కార్యక్రమంలో సమాచార రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

# ప్రజల ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆసలైన అభివృద్ధి

ఎమ్మెల్యే హరీష్‌రావు





**జనం పవర్, సిద్దిపేట జిల్లా ఆగస్టు 18:** భవనాలు పెరగడం, ఆసుపత్రిలో ప్రజలు పెరగడం నిజమైన అభివృద్ధి కాదని ప్రజల ఆరోగ్యం మెరుగు కావడమే నిజమైన అభివృద్ధి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గారు చెప్పారు. జాతీయ యోగా పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికైన సిద్దిపేట యోగా సాధకులను ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలుష్య పరిస్థితుల్లో సమాజాన్ని ఆరోగ్యవంతం చేయడం నిర్మాణాత్మకమని చెప్పారు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ యోగ సాధకులను తయారు చేయడం, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు పంపించడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన 8మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించి సిద్దిపేట ఖ్యాతిని చాటాలని సూచించారు. యోగాసనాలు కేవలం క్రీడ మాత్రమే కాదన్నారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యవంతమైన జీవనానికి ఆధారం యోగ పునాది వంటిదని చెప్పారు. ఆరోగ్య సిద్దిపేట నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తోట సతీష్, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, అసోసియేషన్ సభ్యులు బసవరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో 18 నుండి 25 సంవత్సరాల విభాగంలో (రిథ్మిక్‌పెయిర్) బం గారు పతకాన్ని సాధించిన ఆకారం మనిషా, గుంటపల్లి పూజిత, సీనియర్ ఏ విభాగంలో (హ్యాండ్ బ్యాలెన్స్) పతకం సాధించిన శ్రీ ప్రసన్న, సీనియర్ బి విభాగంలో విజేత జైన సంధ్య (ట్విస్టింగ్), ఎం. నర్మద (బ్యాక్ బెండింగ్), సీనియర్ సి విభాగంలో గోల్డ్ మెడల్ విజేతలు పి. సురేష్ యాదవ్ (ట్రెడిషనల్, ట్విస్టింగ్), కవితారావు (బ్యాక్ బెండింగ్), పి. సంపత్ (బ్యాక్ బెండింగ్),సీనియర్ ఏ విభాగంలో రజత పతక విజేత బత్తిని సంధ్య (ట్రెడిషనల్ యోగా)లను హరీష్‌రావు సన్మానించి జాతీయస్థాయిలో విజయాలను సాధించాలని శుభాకాంక్షలు ప్రకటించారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి బ్రహ్మోత్సవాలు

**జనం పవర్,పటాన్చెరు,ఆగస్టు 17:** పటాన్చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా కొనసాగాయి. ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చక్రస్నానం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు ఆలయ ఆర్చకుల సన్నిధిలో నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో మెట్టు ఎల్లేష్ యాదవ్ దంపతులు, రమేష్ దంపతులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.



## కల్యాణలక్ష్మీ, షాదీముబారక్
## చెక్కులు పంపిణీ చేసిన రామగుండం ఎమ్మెల్యే




**జనం పవర్, గోదావరిఖని, ఆగస్టు 17:** రామగుండం కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు ఏడు కోట్ల 56 లక్షలతో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశామని రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు సంక్షేమ చెక్కులతో పాటు, రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ చెందిన 111మంది కళ్యాణ లక్ష్మి, షాది ముభారఖ్ లబ్ధిదారులకు రూ. 1,11,12,876- విలువ గల చెక్కులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పంపిణి చేశామని తెలిపారు. ఎక్కడ కూడా పేద కుటుంబం లేకుండా చేయడమే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా అంతర్గాం మండలంలో రెండు కోట్లతో, పాలకుర్తి మండలంలో రెండు కోట్లతో మహిళ భవన్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా రామగుండం నగరానికి అభివృద్ధి చేయాలి అనే ఆలోచనతో ముందుకు వెళుతున్న ప్రతి నిరుపేద కుటుంబాలకు గుర్తించి తెలంగాణ ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి అందేవిధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభు త్వం లో ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీ లైటింగ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు కూడా సహకరించాలని కోరారు. రామగుండంలో 1,800 విద్యుత్ పవర్ ప్లాంట్ తీసుకోవస్తున్నామని, అదేవిధంగా సింగరేణి 25 కోట్లతో నిధులతో సింగర్ క్వార్టర్స్ ఏరియాలో రూట్స్, డ్రైనేజి వేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొ రేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు ఉన్నారు.

# నర్మేటలో ఘనంగా పోచమ్మ బోనాలు


**జనం పవర్, సిద్దిపేట జిల్లా. ఆగస్టు 17:** నంగునూరు మండలం నర్మేట గ్రామంలో ప్రజలు పోచమ్మ తల్లికి బోనాలు ఘనంగా నిర్వహించారు.ఆదివారం గ్రామంలో అన్ని కుల సంఘాల ప్రజలు పోచమ్మ తల్లికి ఉపవాసాలతో బోనాలు వండి పోచమ్మ ఆలయాంలో బోనాలతో నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి అధిక దిగుబడులు రావాలని, తమ కుటుంబాలు చల్లగా ఉండాలని గ్రామ దేవతలైన పోచమ్మ,మైసమ్మ దేవతలకు పూజలు నిర్వహించి బోనాల సమర్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కులసంఘాల పెద్దలు ,మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



## ఆనారోగ్య సమస్యలతో బాధపడుతూ
## వృద్ధురాలు ఆత్మహత్య

**ధర్మారం, ఆగస్టు 17:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింగాపూర్ గ్రామానికి చెందిన చల్లా రాజమ్మ (78) గత కొంతకాలంగా బిపి గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. వ్యాధి కారణంగా మానసికంగా కృంగిపోయిన రాజమ్మ తన జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి సమీపంలో ఉన్న చేదబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తన కుమారుడు చాల్ల గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన జిల్లెల ఆదిత్యరెడ్డి



**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 17:** హైదరాబాద్ గాంధీ నగర్‌లోని తెరత్ భవన్‌లో జరిగిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి వ్యక్తిగత సహాయకుడు బాలకృష్ణ కుమార్తె మహాలక్ష్మి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, నూతన వధూవరులను ఏఐపీసీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ నేషనల్ హెడ్, డా. జిల్లెల ఆదిత్య రెడ్డి ఆశీర్వదించారు.

## పటేల్ గూడా హరివిల్లు టౌన్‌షిప్‌లో విషాదం
### రెండో అంతస్తు నుంచి పడి బాలుడి మృతి



**జనం పవర్, పటాన్చెరు (పటేల్‌గూడ), ఆగస్టు 17:** అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ గూడాలోని హరివిల్లు టౌన్‌షిప్‌లో ఆదివారం మధ్యాహ్నం దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివసిస్తున్న హర్షవర్ధన్ (4) అనే బాలుడు రెండో అంతస్తులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు అమీన్ పూర్ పోలీసులు తెలిపారు. బాలుని తండ్రి కురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనతో టౌన్‌షిప్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 17:** జిల్లా సమీకృత కార్యాలయ కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వర్షాలు కురుస్తున్నందున రద్దు చేస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు వినతులు ఇవ్వడానికి సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికారులు అందరు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి వారి సమస్యలపై దరఖాస్తులు ఇవ్వడానికి సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## దోమల బెడదకు ప్రత్యేక చర్యలు

**మద్నూర్, ఆగస్టు 17:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్దతడూర్ గ్రామంలో ఆదివారం మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మురికి కాలువలు, ఇతర ప్రాంతాలు బురదమయంగా మారాయి. నీరు నిలిచి ఉన్న చోట దోమలు పెరిగే అవకాశం ఉండటంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి, యువ నాయకుడు కొండ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**జనం పవర్, జన్నారం, ఆగస్టు 17:** జన్నారం మండలంలోని పొన్కల్ మేజర్ పంచాయతీ పరిధిలో వరదకు గురైన బుడగ జంగాల కాలనీ, రోటిగూడ గ్రామాలను ఆదివారం ఉదయం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా జన్నారం వాగు పక్కన ఉన్న ప్రాంతాలను పరిశీలించి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే బాధిత ప్రజలకు, రైతులకు ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామన్నారు. బుడగ జంగాల కాలనీలో ఇళ్లను తొలగించి, పరిసర ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి మరోచోటికి మారుస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అటవీ ప్రాంతాన ఉన్న ప్రజలు, బర్ల, గొర్ల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు తెలియపరచాలన్నారు. అధికారులు స్పందించకుంటే తన వాట్సాప్ నెంబర్‌కి 24/7 తెలిపితే మీ సమస్యను పరిష్కరిస్తానని ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, గ్రామ వైస్ చైర్మన్ ఫాసిల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. మండల తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో ఉమా షరీఫ్, పొనకల్ గ్రామపంచాయతీ ఈవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వీకే ఓసీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



**జేసీ నాయకుల డిమాండ్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17:** కొత్తగూడెం సింగరేణి వీకే ఓసీలో మొదటిగా స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం రుద్రంపూర్ సిఈఆర్ క్లబ్‌లో జరిగిన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ సమావేశంలో సింగరేణి కాంటాక్ట్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ వీకేఓసీ ప్రారంభం కాబోతున్న సందర్భంలో స్థానికులనే మొదటిగా విధులలోకి తీసుకోవాలని అన్నారు. గతంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలలో అధికారులు, యాజమాన్యం మొదటగా స్థానికులకు అవకాశం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అనేక కార్మిక సంఘాలు సింగరేణి యాజమాన్యాలను కలిసినప్పుడు స్థానికులకే అవకాశం ఇస్తామని బి రిజిస్టర్ ప్రకారమే తీసుకుంటామని హామీ ఇచ్చారని ఇపుడు వచ్చిన సౌదా కంపెనీతో మాట్లాడతామని చెప్పారు. ఇప్పుడు టెండర్ వేసుకుని వచ్చిన సౌదా కంపెనీ పాతవారికే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారన్నారు. గతంలో 2019లో మహాలక్ష్మి కంపెనీ పని చేసి వెళ్ళిన తర్వాత స్థానికులు ఉద్యోగాలు లేక కరోనా కాలంలో అనేక అప్పులపాలై బ్రతుకు భారమై ఓసి కార్మికులు ఉన్న ఊర్లోనే కష్టాలలో బతుకుతున్నారని తెలిపారు. స్థానిక కార్మికులను దృష్టిలో పెట్టుకొని సౌదా కంపెనీ మొదటగా స్థానికులనే ఉద్యోగాలలోకి తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ కోరిందన్నారు. టెండర్ వేసినప్పుడు సౌదా కంపెనీ కూడా మొదటిగా స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చిందని అప్లికేషన్లే మాకు ప్రామాణికం కాదని, లోకల్ వాళ్లే మాకు ప్రాధాన్యత అని చెప్పి కార్మిక సంఘాలకు హామీ ఇచ్చిందని ఇప్పుడు ఆ మాట ప్రకారమే మొదటిగా స్థానికులను తీసుకోవాలని ఆ సంఘాలు డిమాండ్ చేశాయన్నారు. సింగరేణికి పుట్టినిల్లు అయిన కొత్తగూడెంలో కార్మిక వర్గం కష్టాలలో ఉందని ఓసీలు లేక పనులు లేక భూములు పోయి ఇండ్లు కోల్పోయి నిర్వాసితులుగా మారిపోయి కడుపేదరికంలో ఉన్నారని వారు అన్నారు. తక్షణమే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ విషయంలో కార్మిక సంఘాలు రాజీ పడేది లేదని జేఏసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మార్షల్, జెట్టి మోహన్, ఎన్.సంజీవ్, భూక్య రమేష్, రవి గౌడ్, మోహన్, ఆంజనేయులు, రఘు, యాకయ్య, బాచి, హైట్ శివ, ఆమ్మద్, శివ శంకర్, కలకోట రాజు, గుండా శీను, కరుణాకర్, నాగరాజు, సాంబ శివరావు, దుర్గ, చొప్పరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేలాల గట్టు మల్లన్న బోనాలు



**జనం పవర్, జైపూర్, ఆగస్టు 17:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గట్టు మల్లన్న స్వామికి ఆదివారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్థల పురాణం ప్రకారం ఇక్కడ పాండవులు సంచరించారని తెలుస్తోంది. గుట్టపైన ఆరు అడుగుల వెడల్పుతో భీముని అడుగు కూడా ఉంది. పిల్లలు లేనివారు గుట్టపైన సీతమ్మ కొల్లు గుంటలో నీరు తాగితే పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం.

శ్రావణమాసం చివరి ఆదివారం మల్లన్నకు ఇష్టమైనది కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో బోనాలు, పట్నాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు, శివసత్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి.



# శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

**భద్రత, బందోబస్తు కోసం మండపాలు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలి**

**ఎస్పీ మహేష్ బి గితే**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 17:** ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గణేష్ మండపాల నిర్వాహకులు తెలంగాణ పోలీసు శాఖ రూపొందించిన పోర్టల్ https://policeportal.tspolice.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపంనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమని, ఈ సమాచారం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు. పోలీస్ శాఖ ఆన్‌లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేయడం జరుగుతుందని, ఆ తరువాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

**సింగరేణి సీఎండీని కలిసిన**

# గిరిజన ఉద్యోగుల నూతన కమిటీ



**జనం పవర్, జైపూర్, ఆగస్టు 17:** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన సెంట్రల్ కమిటీ సభ్యులు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అధ్యక్షుడు ధరావత్ పంతుల, జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియను వివరించి, రోస్టర్ వెరిఫికేషన్, ప్రమోషన్ పాలసీ వంటి గిరిజన ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్న విషయంపై చర్చించారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఎం డి బలరాం, డైరెక్టర్ గౌతమ్ పోట్రు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ, గిరిజన ఉద్యోగుల న్యాయపూరితమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. జనరల్ మేనేజర్లు, లైజాన్ సెల్ అధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఆంగోత్ భాస్కరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోకాళ్ల తిరుమలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ దశరథ్, వైస్ ప్రెసిడెంట్ భూక్య వెంకట్రామ్, డిప్యూటీ జి.ఎస్. బి.కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఏ.ఉపేందర్, ఇల్లందు ఏరియా ప్రెసిడెంట్ బి.కిషన్, కొత్తగూడెం ఏరియా సెక్రటరీ హీరోలాల్, మణుగూరు ఏరియా లైజాన్ ఆఫీసర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. గిరిజన ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

**జనం పవర్, జన్నారం, ఆగస్టు 17:** జన్నారం మండలం రాయికుంట కొత్త చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. ఆదివారం ఉదయం కొత్తపేట, కొత్తగూడెంకు చెందిన ఆత్రం భీము (36) కొత్త చెరువులో చేపలు పడుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. హఠాత్తుగా ఫిట్స్ రావడంతో నీటిలో పడిపోయి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో రాయికుంట, కొత్తపేట, కొత్తగూడెం, కవ్వాల్, గ్రామాలలో విషాదం నెలకొంది.

## రైటర్ బస్తీలో చెత్త క్లీనింగ్

**స్పందించిన మాజీ కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజు**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తీ గొల్లగూడెం ఏరియాలో పేరుకుపోయిన చెత్త వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. అంతేకాకుండా విష సర్పాలు సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయి మాజీ కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజుకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే స్పందించారు. బస్తీలో దట్టంగా పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు. సమస్యల పట్ల స్పందించిన మాజీ కౌన్సిలర్ ధర్మరాజును ప్రజలు అభినందిస్తున్నారు.

## గోదావరి తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి



**జనం పవర్, జైపూర్, ఆగస్టు 17:** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం ఎల్లంపెల్లి గేట్లు ఎత్తివేయడంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఆదివారం ఉదయం మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, ఇందారం గ్రామ పంచాయతీ శివారులోని గోదావరి నదిని సందర్శించి, మత్స్యకారులు, గ్రామ ప్రజలు ట్రాక్టర్లు అటువైపు వెళ్లకుండా రోడ్డును మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తినందున వరద నీరు పెద్ద ఎత్తున వస్తోందని, జైపూర్ మండలంలోని గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు గోదావరి వైపు వెళ్లకుండా, పశువులను కూడా వెళ్లనీయకుండా చూడాలని, ఇంకా రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా తీజ్ పండుగ



**జనం పవర్, జన్నారం, ఆగస్టు 17:** జన్నారం మండలంలోని కవ్వాల్ బంగారు తండా గ్రామంలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోడ రామ్‌ధన్ నాయక్ తీజ్ పండుగా గురించి వివరించారు. సాధారణంగా తొలకరి జల్లులో కనిపించే ఆరుద్ర పురుగును బంజారాలు తీజ్ అంటారు. తీజ్ అంటే నారు అని అర్థం వస్తుంది. సీత్లా భవాని పూజ ముగిసిన తర్వాత పెళ్లి కాని ఆడపిల్లలు జరుపుకునే పండుగనే తీజ్. ఈ పండుగ బతుకమ్మ పండుగను పోలి ఉంటుంది. లంబాడీలు పూలకు బదులుగా గోధుమ, శెనగ మొలకలను పూజిస్తారు. లంబాడీ యువతులు ఎర్రమట్టి పోసి దాంట్లో మెత్తటి ఎరువును చల్లుతారు. యువతులు, ఆడపడుచులు అందరూ కలసి సాయంకాలం పాటలు పాడుతూ నృత్యం చేస్తూ గోధుమ, శెనగ మొలకలను బుట్టల్లో చల్లుతారు. ఈ పండుగ రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో తండాలో ఉన్న పెండ్లి కాని అమ్మాయిలు అందరూ కలసి ఇత్తడి బిందె నెత్తిపై పెట్టుకొనిపోయి పాటలు పాడుతో నీళు తీసుకు వస్తారు. యువతులు తెచ్చిన నీళ్లను తీజ్ బుట్టలపై చల్లుతారు. తీజ్‌ను 8 రోజులు పూజించి తొమ్మిదో రోజున అంగరంగ వైభవంతో తండాకు కిలోమీటరు దూరంలో ఉన్న కాల్వ లేదా చెరువులో నిమజ్జనం చేస్తారు. అనంతరం ఇంట్లో అక్కాచెల్లెళ్లు ఉంటే సోదరుడు వారి కాళ్ళు కడిగి బొట్టుపెట్టి కట్న కానుకలు సమర్పిస్తారు. తీజ్ పండుగ ఏడో రోజున డమోలి చేస్తారు. ఎనిమిదో రోజు ఘణోర్ అనే మట్టి బొమ్మలను తయారు చేసి హాస్య భరితమైన పాటలతో ఆహ్లాదంగా జరుపుకుంటారు. యువతులు మాత్రం శాకాహార వంటలను ఈ తొమ్మిది రోజులు మితంగా తింటారు.

# రైతులకు మేలు కంటే రాజకీయాలే ముఖ్యమా..

**ఎమ్మెల్యే హరీష్‌రావు**



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 17:** కాలేశ్వరం మోటారు ఆన్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం గోదావరి నీళ్లు సముద్రంలోకి పంపుతామంటే బిఆర్ఎస్ ఊరుకోదు. లక్షల మందితో వచ్చి కాలేశ్వరం మోటార్లు ఆన్‌చేస్తాము. మాజీ మంత్రి హరీష్‌రావు. నీళ్లు ఫుల్‌గా కరెంటు ఫుల్‌గా ఉంది కాంగ్రెస్ వాళ్లు కటుక ఒత్తుడు చాతనైత లేదా మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు కాంగ్రెస్ పార్టీ రైతుల అంటే రాజకీయాలే ముఖ్యమని ఆయన ఆరోపించారు కాలేశ్వరం ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేయలేకపోవడం రైతులకు కర్బ్యా నీళ్లు వదలకపోవడం హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖలు సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తన రాజకీయాలకోసం రైతులపై ఒక ప్రతీకారం తీర్చుకుంటున్నది అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాల తప్ప కీడు చేయకూడదు ప్రజలు కీడు చేస్తే అది ప్రభుత్వం అనబడదు కట్టిన బిల్లులు పెట్టిన పొయ్యిలాగా కాలేశ్వరం ప్రాజెక్టు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టినది హరీష్ రావు విమర్శించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 62 క్యూసెక్కుల వరద వస్తుందని కడియం ప్రాజెక్టు మధ్యాహ్నం తర్వాత 1.50.000 క్యూసెట్ల వరద సాయంత్రం వరకు ఈ పూర్తి వద్ద కడెం ప్రాజెక్టు నుండి శ్రీపాద ఎల్లంపల్లి కి వస్తుందని అన్నారు నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి లాగా ఉంది నంది మేడారం కటక వత్తే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మీకు మానేరులో పడతాయని ఆయన అన్నారు

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు
# కేశవపట్నం విద్యార్థులు ఎంపిక





**శంకరపట్నం, ఆగస్టు 17:** శంకరపట్నం మండలం లోని కేశవపట్నం ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులు సానియా, ఆదిదుర్గ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 18 నుండి 19 తేదీలలో రంగారెడ్డి జిల్లా గురుకుల విద్యాపీట్ హైస్కూల్ ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారు. పోటీలకు విద్యార్థులు ఎంపిక పట్ల హెచ్ఎం సుభాష్, పిడిభక్తు రాజకుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అనిత, తణుకు ఓంకారం, గాజుల శ్రీనివాస్, జాతీయ క్రీడాకారుడు సంపత్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## శాంతియుతంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

**ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి**



**శంకరపట్నం, ఆగస్టు 17:** ప్రజలు శాంతి యుత వాతావరణం లో గణేష్ నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలని కేశవపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. శంకరపట్నంమండలంలో గణేష్ మండపం నిర్వహణకు మండపాల నిర్వాహకులు తెలంగాణ పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ https://police portal.ts police.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం మాత్రమేనని, ఈసమాచారం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు.పోలీస్ శాఖ ఆన్‌లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేస్తారని, తరువాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

**గణేష్ మండపాల నిర్వాహకులు పాటించ వలసిన నియమ నిబంధనలు..**

గణేష్ మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే. ప్రతీ మండపం వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి. గణేష్ మండపాలు ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలి. మండపాల్లో శోభాయాత్ర సందర్భంగా ఎట్టిపరిస్థితులోను డిజే సౌండ్ లను ఏర్పాటు చేయరాదు. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు ఏర్పాటు చేసు కోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం. మండపాల్లో ఏదైనా అనుమానా స్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు. ఎలాంటి సందేహాలు ఉన్న పోలీసు లేదా డయల్ 100కిసమాచారంఇవ్వాలని సూచించారు.

# పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు



**నిజామాబాద్, ఆగస్టు 17:** కామారెడ్డి – మెదక్ జిల్లా సరిహద్దులో గల పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. నాగిరెడ్డిపేట మండలంలో గల పోచారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నది. వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పోచారం నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు నేరుగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు చేరుకోనుంది. కాగా, తెలంగాణలో గతవారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు వరదలు పోటెత్తాయి. ఇప్పటికే వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈక్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలుకు రిసే అవకాశం ఉందని తెలిపింది.

# కుభీర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు వేడుకలు

**కుభీర్, ఆగస్టు 17:** మండల కేంద్రంలోని కానోబా వీధి శ్రీకృష్ణ ఆలయంలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం అన్నదానంతో ముగిశాయి. శనివారం అర్ధరాత్రి శ్రీకృష్ణుని జననం అనంతరం ఊయలలో శ్రీకృష్ణుని ప్రతిమకు నామకరణం చేసే కార్యక్రమంకన్నుల పండువగాజరిగింది.అ నంతరం కృష్ణుని వేషధారణలో చిన్నారి ఉట్టి కొట్టేదానిని ఉత్సాహంగా నిర్వహించారు.



# భారీ వర్షాలతో బొగత జలపాతం అందాలు

**వాజేడు, ఆగస్టు 17:** భారీ వర్షాలు కురుస్తుండడంతో ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలోని బొగత జలపాతం కనువిందు చేస్తున్నది. పాలసంద్రంలా మారి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వచ్చి బొగత జలపాతాన్ని సందర్శించారు.



# భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న వాగులు

**టేకులపల్లి, ఆగస్టు 17:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల రహదారులపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. పంట పొలాల్లోకి నీరు చేరడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. ఖమ్మం నగరంలో నిన్నామొన్నటివరకు ఎనిమిది అడుగులకే పరిమితమైన మున్నేరు శనివారం ఒక్కసారిగా పెరిగింది. సాయంత్రానికి 15 అడుగులకు చేరుకోవడంతోఅధికార యంత్రాంగం అప్రమత్తమైంది. డీసీపీ ప్రసాదరావు, ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ ముష్కారాజ్‌తో కలిసి నాయుడుపేట సమీపంలో వరద ఉధృతిని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మున్సిపాలిటీ అధికారులతో కలిసి మున్నేరు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి కాలనీవాసులను అప్రమత్తం చేశారు. మరో రెండు అడుగులు ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది.

# నాగులవంచ రైల్వేస్టేషన్ పునఃప్రారంభం



**మధిర, ఆగస్టు 17:** ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఖమ్మం–విజయవాడ ప్రధాన రైలు మార్గంలో చరిత్ర కలిగిన నాగులవంచ రైల్వేస్టేషన్‌ను ఇటీవల మూసివేశారు. రైల్వేస్టేషన్ మూసివేత వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఈ ప్రాంత ప్రజలు రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శనివారం రైల్వే ఉన్నత అధికారులు రైల్వే స్టేషన్ ఎత్తివేతను నిలిపివేస్తూ జీవో జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు ఖమ్మం రైల్వే కమర్షియల్ డిపార్టుమెంట్ అధికారి శ్రీనివాసులు ఆదివారం రైల్వేస్టేషన్‌ను పునఃప్రారంభిచారు. ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ టికెట్ బుకింగ్ క్లర్క్‌గా శేష్‌కుమారిని నియమించారు. విజయవాడ– భద్రాచలం రోడ్డు, దోర్నకల్–విజయ వాడ వెళు ప్రయాణికులకు టికెట్‌లు ఇ చ్చారు.

ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాస్, పరిటాల యలమంద, కోపూరి నవీన్, ఆలస్యం బసవయ్య, బొర్రా ప్రసా ద్, కొల్లి బాబు, అంబటి శాంతయ్య, పాల్గొన్నారు.

# ఈగల వ్యాప్తితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





**డీపీఓ దేవకీదేవి**

**రాయపోల్, ఆగస్టు 17:** ముబారస్ పూర్ గ్రామంలో ఈగల వ్యాప్తితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్ పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం మా గ్రామంలో ఈగలు అధికంగా ఉన్నాయని సమస్యను పరిష్కరించాలని ఫోన్ ద్వారా డీపీఓకు ఫిర్యాదు చేశాడు. డీపీఓ దేవకీదేవి ఆదివారం డీఎంహెచ్ఓ ధనరాజ్, జిల్లా పశువైద్యాధికారి పూర్ణచంద్రరావుతో కలిసి డీపీఓ గ్రామాన్ని సందర్శించి వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి దగ్గరలోనే పౌల్ట్రీ ఫారంలు ఉండడంతోనే ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. కోళ్ల ఫారం యజమానులు ఫారంలో చని పోయిన కోళ్లను విచ్చలవిడిగా బయటపడేయడంతో ఆ వ్యర్థాల వల్ల ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. కోళ్ల ఫారాలలో చనిపోయిన కోళ్లను బయటపడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ చేయాలని ఇంచార్జ్ ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, పంచాయతీ కార్యదర్శి సునీతలకు సూచించారు. కోళ్ల ఫారం యజమానులు చనిపోయిన కోళ్లను బయటపడేయకుండా గుంత తీసి పూడ్చిపెట్టాలని సూచించారు. గ్రామంలో ఈగల మందు కయ్యే ఖర్చులు యజమానులే భరించాలని తెలిపారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వీధుల్లో ఈగలమందు, ఫాగింగ్ పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పిఓ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి,ఇంచార్జ్ మండల పశు వైద్యాధికారి శ్రావణ్ కుమార్, మండల వైద్యాధికారి నాగరాజు, డిప్యూటీ తహసిల్దార్ జహీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహస్వామి ప్రసాదం స్వీకరించిన
# టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల

**పెద్దపల్లి రూరల్ ఆగస్టు 17 :** పెద్దపల్లి మండలంలోని భోజన్నపేటకు చెందిన హనుమాన్ స్వాముల నుంచి యాదగిరి లక్ష్మీనృసింహస్వామి నుంచి తీసుకొచ్చిన స్వామి ప్రసాదాన్ని టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేష్ స్వీకరిం చారు. ఈ మేరకు గత కొద్ది రోజులుగా హనుమాన్ మాల ధరించిన స్వాములు యాదాద్రి పర్యటనకు వెళ్లి అక్కడి నుంచి తీసుకొచ్చిన యాదగిరి లక్ష్మీనృసింహస్వామి ప్రసాదాన్ని రాకేష్‌కు పెద్దపల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలిసి అందజేశారు. ప్రసాదం అందించిన వారిలో భోజన్నపేటకు చెందిన ఆంజనేయస్వామి మాలధరించిన స్వాములు మేకల సంతోష్, జడల శ్రీనివాస్, బైరీ సురేష్ , బిట్టి అశోక్, మేరుగు ఓదెలు, మేడగొని తిరుపతి, ఆవుల సంతోష్‌లు ఉన్నారు.

# ఆయుర్వేదం.. అద్భుత ఫలితం..

- ప్రాచీన వైద్యంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- రోగులతో సందడిగా మారిన ఆస్పత్రి

(జనం పవర్, వరంగల్ బ్యూరో)

అది నుంచి వస్తున్న వన మూలికల వైద్యం ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది.. మొన్నటి వరకు ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య ఎదురైనా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించే వారు. వ్యాధి నయం కావడం కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనకాడే వారు కాదు.. అయితే ఇప్పుడు ఆ రోజులకు కాలం చెల్లబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ వైద్యాన్ని పక్కనబెట్టి జనం ఆయుర్వేదం వైపు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే ఆయుర్వేదం సర్వరోగ నివారిణిగా ప్రజల్లో నమ్మకం బలపడతోంది. అంతే కాదు అద్భుతమైన ఫలితాలు ఇస్తోందనే చర్చ కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా పిలువ బడుతున్న వరంగల్‌లోని పాత కూరగాయల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రోగులు క్రమంగా పెరుగుతున్నారు. మొన్నటి వరకు రోగుల తాకిడి అంతగా లేక వెలవెల పోయిన ఆస్పత్రి ఇప్పుడు రోగుల పోవడంతో సందడిగా మారింది. ప్రతి రోజు సుమారు వంద నుంచి 150 మంది వరకు రోగులు ఓపికి వస్తున్నారు. వీరిలో అధికంగా కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ నుంచే గాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు తిరిగి ఎంతో డబ్బులు ఖర్చు చేసినా నయం కాని జబ్బులు ఇక్కడికొచ్చాక తగ్గిపోతున్నాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఏ చిన్న సమస్య తలెత్తినా ఆయుర్వేద ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఆయుర్వేద ఆస్పత్రి ప్రచారంలోకి వస్తోంది.



### పక్షవాతం రోగులకు అదృష్టం

పక్షవాతం రోగులకు ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన చికిత్స లభిస్తోంది. ఏళ్ల కాలంగా ఈ జబ్బుతో బాధపడుతున్న రోగులు సకాలంలో కోలుకొని సాధారణ జనంతో కలిసిపోతున్నారు. అందరిలా చురుగ్గా నడుస్తూ తమ పనులు తాము చేసుకుంటున్నారు. పంచకర్మ (ఫిజియోథెఫి-శరీర మర్దన) ద్వారా త్వరగా కొలుకుంటున్నారు. ఆయుర్వేద ఆస్పత్రికి వస్తున్న వారిలో ఎక్కువ మంది రోగులు పక్షవాతంతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### అన్నీ ఉన్నా...?

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్న చందాన మెరుగైన వైద్య సేవలు అందించే సిబ్బంది అందుబాటులో ఉన్నా మందుల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ మందులు ఆస్పత్రిలో లభించినా ముఖ్యమైన, విలువైన మందులు మాత్రం బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. అంతేకాదు పక్షవాతంతో బాధపడుతున్న రోగులకు పంచకర్మ (మర్దన-మసాజ్) చేయడానికి కావలసిన వస్తువులు రోగులే తెచ్చుకోవాలి.

### సూపరింటెండెంట్ సేవలు భేష్..

ఆయుర్వేద ఆస్పత్రిలో పరిపాలన పర్యవేక్షవేక్షణాధికారి (సూపరింటెండెంట్) పలువురి మన్ననలు పొందుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్ స్థాయి ఉన్నతాధికారులు కొందరు కుర్చీలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వరంగల్‌లోని ఆయుర్వేద ఆస్పత్రికి చెందిన మహిళా సూపరింటెండెంట్ ప్రతి రోజు ఆస్పత్రిలోని వైద్య విభాగాలను ఆకస్మిక తనిఖీలు చేస్తూ సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలిస్తున్నారు. అవసరమైన సూచనలు సలహాలు అందిస్తూ సిబ్బందిని ప్రోత్సహిస్తుండటంతో రోగులలో ఆస్పత్రి పట్ల నమ్మకం, విశ్వాసం పెంచినట్లవుతోంది. ముఖ్యంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారు.

## కూచారం కేజీబీవీని సందర్శించిన ఆర్డీవో జయచందర్ రెడ్డి

**మనోహరాబాద్, ఆగస్టు 17:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కూ చారం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం తూప్రాన్ ఆర్డీవో జయచందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలకు సంబంధించి పలు అంశాలపై చర్చలు జరిపారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలు, హాస్టల్ సౌకర్యాలు, మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించారు.

అనంతరం భవన పరిసరాల శుభ్రత పరిస్థితులను, మౌలిక వసతులను తనిఖీ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే బాలికలకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని, ఏ సమస్యలు ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పాఠశాల అధికారులను ఆదేశించారు.

## అనారోగ్యాల ప్లాస్టిక్ సీసా..

**60 శాతం విద్యార్థుల చేతుల్లో అదే..**

(జనంపవర్, భీమదేవరపల్లి)

ప్లాస్టిక్... ఇది మన జీవితంలో నిత్యావసరంగా మారింది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణాన్ని నాశనం చేస్తూ అనేక వ్యాధులు రావడానికి కారణమవుతోంది. ఈ విషయం తెలిసి కూడ మనం రోజు మన పిల్లలకు అదే ప్లాస్టిక్ నీళ్ల సీసాను ఇచ్చి బడికి పంపుతున్నాం. పేద మధ్య తరగతి పిల్లలు చదువుతున్న సర్కారు బడుల్లో, మధ్యాహ్న భోజన సమయంలో అత్యధిక మంది విద్యార్థులు ఇంటినుండి తెచ్చుకున్న ప్లాస్టిక్ సీసాల్లో తెచ్చుకున్న నీటినే తాగుతున్నారు. తల్లిదండ్రుల అవగాహన లేమి, ఆర్థిక స్తొమత కారణంగా ఒక్కసారి వాడి పారెయాల్సిన ప్లాస్టిక్ సీసాలను సైతం నెలల తరబడి వినియోగిస్తున్నారు. తద్వారా పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 60 శాతం మంది ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తాగుతున్నారు. వేసవి కాలంలో కూడా సీసాల్లో వేడిగా మారే నీటిని తాగుతున్న పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనబడుతున్నాయి. ప్లాస్టిక్‌ను తయారు చేయడానికి ఉపయోగించే పదార్థం పేరు పాలిమర్. దీనిని కార్బన్, ఆక్సీజన్, హైడ్రోజన్, క్లోరైడ్‌తో తయారు చేస్తారు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నివేదిక ప్రకారం చాలా వాటర్ బాటిళ్లలో పాలి కార్బనేట్ ప్లాస్టిక్‌ను, బిపి ఏ అనే రసాయనాన్ని వాడుతున్నారు. ఇవి మనిషి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. హానికరం. మనలోనే కొందరు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని నింపి ఫ్రిజ్‌లో ఉంచి వినియోగిస్తుంటారు. ఇది కూడా మంచిది కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా చాలా పాఠశాలల్లో తాగు నీటి ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. అయినా తరగతి గదిలో లేదా భోజన సమయంలో తాగేందుకు పిల్లలు ప్లాస్టిక్ సీసాలను వాడుతున్నారు. ఇక లేనిచోట రోజంతా ఆ నీరే దిక్కు. స్టీలు సీసాలు మార్కెట్లో కొనాలంటే రూ.150-200లు ఖర్చు అవుతుంది. ఇది పిల్లల తల్లిదండ్రులకు భారం అవుతోంది. అయితే ప్రభుత్వ బడుల్లో తరచూ సేవా కార్యక్రమాలు నిర్వహించే దాతలు చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని స్టీలు సీసాలు అందిస్తే వారి ఆరోగ్యం కాపాడవచ్చు.

### ప్లాస్టిక్‌తో అనేక వ్యాధులు..

ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం మంచిది కాదు.



నాసిరకం ప్లాస్టిక్ సీసాలు ఆరోగ్యానికి చాలా నష్టం కలిగిస్తాయి. ఒకసారి వాడి పారేయాల్సిన సీసాల్లో ఎక్కువ సార్లు నీరు పోసి తాగడం లేదా సీసాలు ఎండలో ఉంచడం వలన ఆ సీసాల్లోని నీటిలో మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతాయి. ఈ నీటిని తాగడం వలన శరీరంలోని హార్మోన్ల సమతుల్యత కాపాడే వ్యవస్థ దెబ్బ తింటుంది. ఇలా నిరంతరం చేయడం వల్ల సంతాన లేమి ఏర్పడి, కాలేయం దెబ్బ తింటుంది. ప్లాస్టిక్ సీసాల్లో నీరు పిల్లలకు ఇవ్వొద్దు. ప్రస్తుతం మార్కెట్లో తక్కువ ధరకే స్టీలు సీసాలు అందుబాటులో ఉన్నాయి. వీలైతే రాగి మెటల్‌తో ఉన్న సీసాలు వినియోగించడం మంచిదని చిన్న పిల్లల వైద్య నిపుణులు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

## తెగిన సింగూర్ కాలువకు మరమ్మతు చేయండి

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ట్రాక్టర్‌పై వెళ్లి కాల్వను పరిశీలించిన మంత్రి**

**ఆందోల్, ఆగస్టు 17:** భారీ వర్షాల కారణంగా తెగిపోయిన సింగూరు కాలువను బాగు చేయాలని సింగూర్ ఇరిగేషన్ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఆదివారం పుల్కల్ మండలం ఇసోజిపేట గ్రామ శివారులోని సింగూర్ కాలువ తెగిపోయిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్యతో కలిసి సందర్శించారు. ఇసోజి పేట గ్రామం నుండి శివారు ప్రాంతానికి ట్రాక్టర్‌పై వెళ్లారు. భారీ వర్షాలకు కాలువ తెగిపోయిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తొందరగా మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగూర్ ప్రాజెక్టు ప్రమాదంలో ఉందని తెలుసుకున్న మంత్రి ప్రాజెక్ట్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం కలగకుండా శాశ్వత భద్రత చర్యలు తీసుకుంటామన్నారు. ఈ భద్రత కోసం ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాల్వ సిసి లైనింగ్ పనులు వర్షాకాలం ముగిసిన తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, అందోల్ ఆర్డీవో పాండు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నగర్ కాలని బీజేపీ కమిటీ నియామకం



**జూబ్లీహిల్స్, ఆగస్టు 17:** శ్రీ నగర్ కాలని (జూబ్లిహిల్స్ నియోజక వర్గం) భారతీయ జనతా పార్టీ నూతన కమిటీని డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు జి. అనంతలక్ష్మి నియమించారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా పూజారి శ్రీనివాస్, రాజ్ వినయ్, పంకజ్ నాథ్, కడియాల సుధారాణి, ప్రధాన కార్యద ర్శులుగా నరేంద్ర యాదవ్, హరీష్ కుమార్, కార్యదర్శులుగా కృష్ణ గౌడ్, అజయ్, ప్రేమ లత యాదవ్, శ్రీ లక్ష్మీ, సోషల్ మీడియా రాజేష్ యువ మోర్చా అధ్యక్షుడు సాయి కిరణ్ యాదవ్, మహిళా మోర్చా శ్రీదేవి, ఓబిసి మోర్చా ఉమేష్, ఎస్‌సి మోర్చా వినోద్ కుమార్, మైనారిటీ మోర్చా విల్సన్ ఉన్నారు. మరో నలభై మందిని ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్‌గా నియమించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి సూచనలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు

## ఇందిరమ్మ ఇళ్ల కడప పూజ



**వేములవాడ, ఆగస్టు 17:** వేములవాడ పట్టణంలోని బాలనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఆదివారం పలువురు నిర్వహించిన కడప పూజ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఇచ్చిన మాట ప్రకారం లబ్దిదారులకు చీర సారెను ప్రభుత్వ విప్ అందజేశారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో స్వంత ఇంటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## అమృతారెడ్డి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే విజయసింహా రెడ్డి నివాళి




**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 17:** మాడుగులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన చిలిపి రెడ్డి అమృతా రెడ్డి 52 సం.రాలు అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహా రెడ్డి ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి అమృతా రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట తాజా మాజీ సర్పంచ్ రంగారావు, చింతల వెంకటేశ్వర్లు, శీను తదితరులు ఉన్నారు.

## నిబంధనలు విరుద్ధంగా డీజే లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు



**వేములవాడ, ఆగస్టు 17:** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే యజమానులతో ఆదివారం సీఐ వీరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డీజే యజమానులు నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహింస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహించినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద, శోభాయాత్రలో కానీ డీజేలు కానీ యాంప్లిఫైయర్ తో బాక్స్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించినా యజమానులతో పాటు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద పోలీస్ అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, అదికూడా రాత్రి 10 గంటల వరకు మాత్రమే అని, అధిక శబ్దాలు చేసే డీజేల వలన చిన్న పిల్లలు, విద్యార్థుల చదువుకు, వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో డీజే నిర్వహకులపై డయల్100 కాల్స్ వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదు అని సీఐ స్పష్టం చేశారు.

## రెజంగ్ల రజ్ కలశ యాత్రకు అపూర్వ స్వాగతం



**తంగళ్ళపల్లి, ఆగస్టు 17:** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రెజంగ్ల రజ్ కలశ యాత్రకు అపూర్వ స్వాగతం పలికారు. అఖిల భారత యాదవ మహా సభ ఆధ్వర్యంలో రేజంగ్ల రజ్ కలశ యాత్రలో భాగంగా తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చేరుకున్న మాజీ సైనికుల విభాగం కన్వీనర్ జక్కుల శ్రీనివాస్‌కు నాయకులు స్వాగతం పలికారు. యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. యాదవులు శౌర్యానికి ధైర్యానికి ప్రతీకని జక్కుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిక్కు, పంజాబ్ రెజిమెంట్ ప్రకటించిన విధంగా యాదవ రెజ్మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశం కోసం యాదవులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభల రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఏటి యాదవ్. ఉపాధ్యక్షులు జడల రవీందర్ యాదవ్. ప్రధాన కార్యదర్శి వీరవేని మల్లేష్ యాదవ్. వాసం మల్లేష్ యాదవ్. ఆసరి బాలరాజు. మిరాల శ్రీనివాస్ యాదవ్. అంబటి చందు యాదవ్. గోగు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరపాలి

**మద్నూర్, ఆగస్టు 17:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గణేశ్ మండపాల సభ్యులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో తహశీల్దార్ ఎం.డి. ముజీబ్, ఎస్సై విజయ్ కొండ మాట్లాడారు. గణేష్ మండపాలను శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించాలని సూచించారు. నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకొని, నిబంధనలు పాటించాలన్నారు. మండపంలో ఇద్దరు వ్యక్తులు తప్పకుండా ఉండాలని తెలిపారు. విద్యుత్ సదుపాయం కొరకు విద్యుత్ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాలలో డీజే సౌండ్ ఉపయోగించరాదని, మద్యం సేవించరాదని, ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**బిచ్కుంద, ఆగస్టు 17:** మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోహన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తుండటంతో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ పరివాహక ప్రాంతం నుండి వరద నీరు భారీగా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని, సోమవారం ఏ సమయంలోనైనా ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి మాజీరా నదిలోకి వదిలే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రాజెక్టు అధికారులు హెచ్చరికలు జారీ చేశారని, నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు మంజీరా పరివాహక ప్రాంతంలోకి గొర్రెల కాపరులు, పశువుల కాపర్లు, చేపలు పట్టేవాళ్లు, రైతులు మంజీరా పరివాహంలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ పోలీసు శాఖల వారికి సమాచారం అందించాలని, లేదా 100 డయల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా తాండూర్‌లో శోభాయాత్ర

**తాండూర్, ఆగస్టు 17:** మండలంలోని బోయపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఎక్కాహం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని 24 గంటల పాటు ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు భజన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. శని, ఆదివారాలలో ద్వారకాపూర్, బోయపల్లి, తాండూర్, రేచిని, అచలాపూర్ గ్రామాలలో భజన కార్యక్రమం నిర్వహించారు. తాండూర్‌లోని బ్రాహ్మణవాడ వెంకటేశ్వర ఆలయంలో ఒకరోజు భజన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో గంగాపూర్ వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ఊరేగింపుగా తాండూర్‌కు తీసుకు వచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చునార్కర్ కృష్ణ కృష్ణుని జన్మ వృత్తాంతాన్ని భజన రూపంలో వర్ణించారు. ఆదివారం విగ్రహాలను



ఊరేగించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, నాయకులు మాసాడి తిరుపతి , బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుబ్బదత్తు మూర్తి, మాజీ జడ్పీటీసీ బానయ్య, సీనియర్ నాయకులు దత్తాత్రేయ రావు, ఎలక రామచందర్, పెరిక రాజన్న, పోలీస్ అధికారి గోపాల్, వసంత్ వినోద్, శేఖర్, శ్రీనివాస్, పిట్టల వేణు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలి

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్ హత్నూర్, ఆగస్టు 17:** భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన రైతులను పలకరించి ధైర్యంగా ఉండాలన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి గుంట భూమిని అధికారులు రికార్డు చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికారులు పని



చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా ఒత్తిడి తీసుకొస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న బహుసాటే జయంతి



**జైనూర్, ఆగస్టు 17:** సాహిత్య రత్న, అన్న బహుసాటే 105వ జయంతి వేడుకలు జైనూరు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న బహుసాటే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆదిలాబాద్ జిల్లా మాంగ్ సమాజ్ అధ్యక్షులు కాంబ్లే ఉద్ధవ్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం రావాలంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్న బహుసాటే, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే లాంటి మహనీయుల చరిత్రను వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. మహిళలు సైతం అన్ని రంగాల్లో ఎదగాలనే ఉద్దేశ్యంతో చదువు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్ ,అన్న బహుసాటే జిల్లా అధ్యక్షుడు దత్త రాజ్ గైక్వాడ్, మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మొహాలే దత్తా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కామ్లే బాబాసాహెబ్, నాయకులు మెశ్రం అంబాజీ, కనక గంగారం, జొన్నవారి పవన్, దుదానే కరణ్, పుల్లారే విజయ్, మొహాలే భరత్, కోటంబె శ్రీహరి, దుదానె శ్యాం, పుల్లారే సోపన్ రావు, సామాజిక కార్యకర్త కాంబ్లే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ఫీవర్ సర్వే



**నార్నూర్, ఆగస్టు 17:** సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సామాజిక ఆరోగ్య ఆసుపత్రి వైద్య అధికారి జితేందర్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని నాగల్ కొండ, ముస్లిం వాడ, మల్కుగూడా, తాడిహత్నూర్, బీసీ వాడ, గుంజాలతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామాల్లో అపరిశుభ్రత లోపించకుండా చూడాలని సూచించారు. చిన్నపాటి జ్వరం దగ్గు జలుబు ఉన్నా ఆసుపత్రికి వచ్చి వైద్య చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి తులసీ దాస్, ఆరోగ్య పర్యవేక్షకులు చౌహాన్ చరణ్ దాస్, సత్యవ్వ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**పెగడపల్లి, ఆగస్టు 17:** చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన మన్నె రాయనర్సు అనే వ్యక్తి ఆదివారం ఉదయం చేపల వేటకు చెరువులోకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో పొలం గట్టు మీద పడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కిరణ్ కుమార్ వివరాలు సేకరిస్తున్నారు. రాయనర్సు మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఊట్కూర్‌లో గంజాయి.. ఇద్దరి అరెస్టు



**ఊట్కూర్, ఆగస్టు 17:** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 15న ఊట్కూర్‌మండల కేంద్రంలోని మక్తల్ ప్రధాన రహదారి అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. యువకుల వద్ద నుంచి 125 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఊట్కూర్ ఎస్సై రమేష్‌కు సమాచారం అందించారు.

నిందితులలో ఒకరు ఊట్కూర్ మండలం చెట్టు కింది అరవింద్ (22), కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ తాలూకా కేంద్రానికి చెందిన కోరేబాన్ సంజీవ్ (23) గుర్తించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. నిషేధిత గంజాయి విక్రయాలు చేపడితే చట్టపరమైన శిక్షలు తప్పవని ఎస్సై రమేష్ హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు చేపడితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

**సరిహద్దు శివారులో..**

తెలంగాణ సరిహద్దు శివారులోని గుడి మిట్కల్, యాద్గీర్ పట్టణాల నుంచి శివారు గ్రామాల మీదుగా ఊట్కూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలైన పులిమామిడి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, మల్లేపల్లి, ఎడవెల్లి, నిడుగుర్తి, పెద్ద జట్రం తదితర గ్రామాలకు గంజాయి సరఫరా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పట్టణాలకు మాత్రమే పరిమితమైన గంజాయి విక్రయాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడంతో గంజాయి మత్తులో యువత తూలుతున్నారు.

దినసరి కూలీలు, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలను చేపడుతున్నారు. విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు బానిస అవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి సరఫరాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి..



**హైదరాబాద్, ఆగస్టు 17:** ఈ మధ్య కాలంలో ప్రయాణికులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు పాల్పడుతున్నారు. విధుల్లో ఆర్టీసీ సిబ్బందిపై ఇలాంటి దాడులకు పాల్పడికే ఉపేక్షించేంది లేదని ఇప్పటికే చాలా సార్లు ఆర్టీసీఎ ఎండీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రయాణికుల్లో మాత్రం మార్పు రావడం లేదు.. రోజు ఎక్కడో ఒక దగ్గర చిన్న చిన్న విషయాలకే ప్రయాణికులు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో మరోసారి వెలుగు చూసింది. మహిళా బస్సు కండక్టర్‌పై ఓ మహిళా ప్రయాణికురాలు దాడికి పాల్పడింది.

ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న బస్సులో ఈ ఘటన జరిగింది. అయితే బస్సు ఎక్కిన ఒక ప్రయాణికురాలు బస్సు స్టాప్‌లో కాకుండా తనకు అనుకూలమైన ప్రాంతంలో బస్సును ఆపమని కండెక్టర్‌కు చెప్పగా.. బస్సును ఎక్కడపడితే అక్కడ ఆపడం కుదరదని సదరు కండక్టర్, డ్రైవర్ చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన సదురు మహిళా ప్రయాణికురాలు.. కండక్టర్‌పై అరవడం స్టార్ట్ చేసింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. అది కాస్తా కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపేశాడు. అయినా కూడా వాళ్ల మధ్య గొడవ తగ్గలేదు. బస్సులోంచి దిగిన తర్వాత కూడా సదరు మహిళా ప్రయాణికురాలు.. కండక్టర్ గొంతు పట్టుకొని కొడుతున్న దృశ్యాలను మనం చూడవచ్చు. అయితే ఈ తంతంగాన్నంత అక్కడే ఒక ప్రయాణికుడు తన ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దీంతో ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## మక్తపల్లి పెరిక కులస్తుల వనభోజనాలు



**తిమ్మాపూర్, ఆగస్టు17:** తిమ్మాపూర్ మండలం మక్తపల్లి గ్రామంలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆవరణలో కులస్తులందరూ కలిసి ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనం చేశారు. చిన్నారులు, మహిళలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

## షఫీ ని పరామర్శించిన ఎంపీ ఈటల

**శంకరపట్నం, ఆగస్టు 17:** శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన మహమ్మద్ షఫీ యొద్దీన్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు గాయపడిన షఫీని ఎంపీ ఈటెల పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిలను తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కందుల సంధ్యారాణి, మాడ గౌతమ్ రెడ్డి, చొప్పరి వేణు తదితరులు ఉన్నారు.

# వరద ప్రాంతాల్లో అధికారులు పర్యటించి మరమ్మతు చర్యలు చేపట్టాలి

### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హన్వాడ, ఆగస్టు 17:** వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ శివారులోని హేమసముద్రం చెరువుకు పడ్డ బుంగను మాజీ మంత్రి స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో 1.5 కి.మీ. ట్రాక్టర్ పై ప్రయాణించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా గండి పడిన విధానాన్ని, నీళ్లు కిందికి వెళ్లకుండా తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీళ్లు కిందకు వెళ్లకుండా రైతులకు ఎక్కువ నష్టం జరుగకుండా వేగంగా గండి పూడ్చాలని అధికారులకు సూచించారు. హేమాసముద్రం చెరువు ఉమ్మడి జిల్లాలోనే పెద్ద చెరువని పేర్కొన్నారు. గతంలో చెరువును రిజర్వాయర్ చేద్దామని అనుకుని , ఒక గ్రామం.. రెండు తండాలు మునుగుతాయని అధికారుల సూచనలతో ఉదండాపూర్ నుంచి ఇక్కడికి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు కు బుంగ పడితే పూడ్చేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇంజినీర్లకు అవసరమున్న సదుపాయాలు కల్పించి కొత్త టెక్నాలజీ ప్రకారం చెరువు బుంగ పూడ్చాలని డిమాండ్ చేశారు. చెరువు బుంగ పూడ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని కోరారు. గతంలో వర్షాలు పడి చెరువులు, ప్రాజెక్ట్‌లోకి నీరు వస్తే అధికారులను అప్రమత్తం చేసి నష్టం కలుగకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. అవకాశం ఉన్న చోట చిన్న చెరువులను కూడా నింపుకున్న పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పుడు




అలాంటి సన్నద్ధత కనిపించడం లేదని విమర్శించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, సీనియర్ నాయకులు కొండా లక్ష్మయ్య, జంబులయ్య, నెత్తికొప్పుల శ్రీనివాసులు, చెన్నయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.




# అవమానించడం నా ఉద్దేశం కాదు

ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ప్రముఖ దర్శకుడు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే కేన్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా తాజాగా 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'(ఐఎఫ్ఎఫ్ఎం)లో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నీరజ్ ఘైవాన్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఈ చిత్రోత్సవాల్లో బాలీవుడ్ అగ్రహీరో ఆమిర్ ఖాన్ 'ఎక్స్‌లెన్స్ ఇన్ సినిమా' అవార్డును అందుకున్నారు. 2025 సంవత్సరానికి గానూ ఐఎఫ్ఎఫ్ఎం ప్రకటించిన ఈ పురస్కారాల్లో 'ఐ వాంట్ టు టాక్' చిత్రంలోని తన నటనకు గానూ ఉత్తమ నటుడిగా అభిషేక్ బచ్చన్, 'అంగమ్మాళ్' (తమిళం) చిత్రానికి గానూ గీతాకైలాసం ఉత్తమ నటిగా, 'బ్లాక్ వారెంట్' ఉత్తమ సిరీస్‌గా అవార్డుల్ని గెల్చుకున్నాయి. కథానాయిక అదితీరావ్ హైదరీ 'డైవర్సిటీ ఇన్ సినిమా' పురస్కారాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆమిర్ మాట్లాడుతూ.. ''నేను బాల్యం నుంచే సినిమాల పట్ల ఆకర్షితుడిని. ఇప్పుడు నేను ఈ 'ఎక్స్‌లెన్స్ ఇన్ సినిమా' అవార్డును దక్కించుకోవడానికి నాకు అద్భుతమైన సినిమాల్లో అవకాశం ఇచ్చిన దర్శకులు, నా సహనటులు, నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులే కారణం. వీరంతా లేకపోతే ఈ పురస్కారం సాధ్యం కాదు'' అని అన్నారు.



# పవన్ రాజకీయ తుపాను..

## రజనీకాంత్ పోస్టుపై స్పందించిన పవన్ కల్యాణ్

పొలిటికల్ తుపాను అని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి రజనీకాంత్ ట్వీట్ చేయడం, దానికి పవన్ బదులివ్వడం నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రజనీకాంత్ నట ప్రస్థానానికి 50 ఏళ్లు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ ఆయనకు ఇటీవల శుభాకాంక్షలు తెలిపారు. దానిపై రజనీకాంత్ ఆదివారం స్పందించారు. ''ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ తుపాను పవన్ కల్యాణ్ గారు.. ప్రేమతో మీరు చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. దాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు'' అని రజనీకాంత్ పేర్కొన్నారు. దానిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ''బిగ్ బ్రదర్ రజనీకాంత్.. మీ అభిమానం, ఆశీస్సులకు కృతజ్ఞుడిని. మీ మాటలు నా హృదయాన్ని తాకాయి. మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా'' అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, నటుడు కమల్‌హాసన్ తదితరులు రజనీకాంత్‌కు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'కూలీ' ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది.






# ఛెత్రి లేకుండానే..



తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే నేషన్స్ కప్ కోసం ఎంపిక చేసిన 35 మంది భారత ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రికి చోటు దక్కలేదు. కొత్త కోచ్ ఖలీద్ జమీల్ శనివారం ఈ జాబితాను ప్రకటించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికి ఇటీవలే రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్న తర్వాత ఛెత్రి నాలుగు మ్యాచ్‌లే ఆడాడు. విశ్రాంతి కావాలనే ఉద్దేశంతో నేషన్స్ కప్‌కు తనను పరిగణనలోకి తీసుకోవద్దని అతడు కోరి ఉంటాడని ఫుట్‌బాల్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో కువైట్‌తో మ్యాచ్ తర్వాత ఛెత్రి రిటైర్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో పునరాగమనం చేసి మాల్దీవులపై ఆడాడు. నాలుగు మ్యాచ్‌ల్లో ఒక గోలే కొట్టాడు. నేషన్స్ కప్‌నకు ఎంపిక చేసిన జట్టులో గోల్‌కీపర్, కెప్టెన్ గుర్‌ప్రీత్ సింగ్, డిఫెండర్ల చింగ్లెన్‌సనా సింగ్, రాహుల్ బెకీ, రోషన్ సింగ్, సురేశ్ సింగ్ తదితరులు ఉన్నారు. ఈనెల 29న ఆరంభమయ్యే నేషన్స్ కప్‌లో గ్రూప్-బిలో ఉన్న భారత్.. తజకిస్థాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్‌తో కలిసి ఆడనుంది. 29న తజకిస్థాన్‌తో, సెప్టెంబర్ 1న ఇరాన్.. 4న అఫ్గానిస్థాన్‌తో ఆడనుంది.

# వివాహ బంధంలోకి యువ తెందూల్కర్.. 'అర్జునుడి' ఆర్జన ఎంతంటే?


క్రికెట్ దిగ్గజం సచిన్ కుమారుడు అర్జున్ తెందూల్కర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇటీవలే అతడికి నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనుమరాలు సానియా చందోక్‌తో వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకు సచిన్ ఫ్యామిలీ నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఈ క్రమంలో అర్జున్ ఆదాయంపై ఇప్పుడు ఫ్యాన్స్ నెట్టింట శోధిస్తున్నారు. ఐపీఎల్‌లో రూ.30 లక్షలకు ముంబయి ఇండియన్స్ తీసుకున్న సంగతి తెలిసిందే. గత సీజన్‌లో ఆడే అవకాశం కూడా రాలేదు. భారత క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు, యాడ్స్ ద్వారా ఆర్జించిన ఆదాయం గురించి అభిమానులకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఇంకా అడుగుపెట్టని అర్జున్ సంపాదన ఎంత ఉంటుందనేది ఇప్పుడందరిలోనూ ఆసక్తి నెలకొంది.

**క్రికెట్ నుంచి..**

ఈ పాతికేళ్ల అర్జున్ 2021లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. అప్పుడు ముంబయి ఇండియన్స్ రూ.20 లక్షలకు తీసుకుంది. మళ్లీ 2023 వేలంలో రూ.30 లక్షలకు తీసుకుంది. గత మెగావేలంలోనూ అంతే మొత్తంతో కొనుగోలు చేసింది. కేవలం ఐదు మ్యాచుల్లోనే ఆడే అవకాశం వచ్చింది. ఐపీఎల్ నుంచి ఇప్పటి వరకూ రూ.1.40 కోట్లు ఆర్జించినట్లు ఓ జాతీయ వెబ్‌సైట్ కథనంలో పేర్కొంది. మెగా లీగ్‌లోనే కాకుండా.. అతడు దేశవాళీ క్రికెట్‌లోనూ ఆడుతున్నాడు. గోవా తరఫున ఇటీవల బరిలోకి దిగాడు. రంజీ ట్రోఫీ, విజయ్ హాజరే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీల్లోనూ ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇక్కడ ఆడటం వల్ల ఏడాదికి రూ. 10 లక్షలు సంపాదిస్తున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. కుటుంబం నుంచి వచ్చిన ఆస్తులతో కలిసి అతడి సంపద విలువ రూ. 22 కోట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం అర్జున్ కుటుంబ సభ్యులతోనే కలిసి ఉంటున్నాడు.

**పేస్ ఆల్‌రౌండరే కానీ..**

ఆరు అడుగుల రెండు అంగుళాల ఎత్తైన అర్జున్ తెందూల్కర్ తన తండ్రిలా కాకుండా పేస్ ఆల్‌రౌండర్ కావడం గమనార్హం. బ్యాటింగ్‌లో రికార్డులు సృష్టించిన సచిన్ బౌలింగ్‌లోనూ వికెట్లు తీశాడు. కానీ, అతడు స్పిన్ బౌలింగ్ వేసేవాడు. అర్జున్ మాత్రం పేసర్ కావడం గమనార్హం. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టని అతడు దేశవాళీలో మాత్రం ఫర్వాలేదనిపించాడు. లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అయిన అర్జున్ 17 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడాడు. మొత్తం 37 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లోనూ 532 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలూ ఉన్నాయి. ఐపీఎల్‌లో 5 మ్యాచుల్లో మూడు వికెట్లు తీశాడు.




PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA, PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.